



కనకమహాలక్ష్మి నమోనమః

- భక్తులతో పోటెత్తిన ఆలయం

విశాఖ వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం గురువారం భక్తులతో పోటెత్తింది. మార్గశిర మాసం రెండవ గురువారం కావడంతో వేకువజాము నుంచే భక్తులు అమ్మవారి దర్శనానికి బారులుతీరారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. రాత్రి వరకు రద్దీ కొనసాగింది. - విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

విధులకు హెచ్‌ఎం డుమ్మా

ఆరు నెలల నుంచి విద్యా బోధనకు దూరం

- ఉదయం వచ్చి బయోమెట్రిక్ హాజరు.. అనంతరం ఇంటిముఖం
- మళ్లీ సాయంత్రం వచ్చి బయోమెట్రిక్ హాజరు
- పాఠాలు చెప్పడానికి వలంటీరు ఏర్పాటు
- ఎంఈవోకు స్థానికులు ఫిర్యాదు
- స్పందించకపోవడంతో వీడియో తీసి వైరల్
- అయినాసరే పాఠశాలను తనిఖీ చేయని ఎంఈవో



హెచ్‌ఎం నాగభూషణం (ఫైల్ ఫొటో)

రోలుగుంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని బుచ్చెంపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యు.నాగభూషణం ఆరు నెలల నుంచి పిల్లలకు పాఠాలు చెప్పడంలేదు. ఉదయం పాఠశాలకు రావడం, బయోమెట్రిక్‌లో హాజరు నమోదు చేసి వెళ్లిపోవడం. మళ్లీ సాయంత్రం స్కూల్‌కి వచ్చి బయోమెట్రిక్‌లో హాజరు నమోదు చేసి వెళ్లిపోవడం ఆనవాయితీగా మారింది. తన బదులు పాఠాలు చెప్పడానికి స్థానికంగా వున్న ఒక యువతిని నియమించుకుని, ఆమెకు కొంత మొత్తం చెల్లిస్తున్నారు. దీంతో స్థానికులు ఇటీవల ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. లేఖను రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించారు. హెచ్‌ఎం వ్యవహారశైలిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇది జరిగి నాలుగు రోజులు అవుతున్నప్పటికీ మండల విద్యా శాఖాధికారి బుచ్చెంపేట పాఠశాలను సందర్శించలేదు. దీంతో హెచ్‌ఎం నాగభూషణం తనకు బదులు అనధికారికంగా నియమించుకున్న ప్రైవేటు వ్యక్తి తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న వీడియోను స్థానికులు చిత్రీకరించి గురువారం మీడియా, ఉపాధ్యాయుల గ్రూపుల్లో పెట్టారు. అయినా ఎంఈవో జాన్‌ప్రసాద్ స్పందించలేదు. దీనిపై ఆయనకు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేసి వివరణ కోరగా.. హెచ్‌ఎం నాగభూషణానికి, ఆయన భార్యకు ఆరోగ్యం బాగుండడం లేదని, ఈ విషయం ఆరు నెలల క్రితమే తన దృష్టికి వచ్చిందన్నారు. సెలవు అయినా పెట్టండి, ఉద్యోగం అయినా మానేయండని అప్పుడే హెచ్‌ఎంకు చెప్పాన్నారు. కానీ ఆయన ఈ రెండూ చేయకుండా పాఠాల బోధనకు ఒక యువతిని ఏర్పాటు చేసుకున్నారని, ఇలాచేస్తే ఇబ్బంది అవుతుందని చెప్పానన్నారు. ఇదే విషయాన్ని రెండు నెలల క్రితం మరోసారి చెప్పానని, మానవతా దృక్పథంతో చర్యలు తీసుకోలేదని చెప్పారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫిర్యాదు లేఖ వచ్చిందని, ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని ఎంఈవో తెలిపారు.



పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న గ్రామానికి చెందిన యువతి

ప్రకృతి సేద్యానికి జీవం

పూర్వ వైభవానికి కూటమి ప్రభుత్వం చర్యలు

- కేంద్ర సాయంతో ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం
- గత టీడీపీ హయాంలో విస్తృతంగా అమలు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్వీర్యం
- సిబ్బందికి వేతనాలు ఇవ్వని దుస్థితి
- తాజాగా జాతీయ మిషన్ ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం
- ప్రకృతి సాగుకు మరింత తోడ్పాటు



ఘన జీవామృతం తయారీలో నిమగ్నమైన మహిళా రైతులు (ఫైల్ ఫొటో)

చోడవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

గత వైసీపీ పాలనలో ఉత్సవ విగ్రహంలా మారిపోయిన ప్రకృతి వ్యవసాయ విభాగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. దేశవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రూ.2,481 కోట్ల విలువైన జాతీయ మిషన్ (ఎన్‌ఎంఎన్‌ఎఫ్)కు ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రి మండలి ఇటీవల ఆమోదం తెలిపింది. వచ్చే రెండేళ్లలో 7.5 లక్షల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తారు. జీవామృతం, బీజామృతం వంటి ఉత్పత్తులను అందించడానికి ఔత్సాహిక రైతులకు శిక్షణ ఇస్తారు..

సేంద్రియ విధానంలో పంటలను సాగు చేసే రైతులకు అవగాహన కల్పించడం, వారికి స్థానికంగా తయారు చేసే కషాయాలు, ఘన/ ద్రవ జీవామృతాలను ఉపయోగించి వ్యవసాయం చేసే పద్ధతులు వివరించి వాటిని పాటించేలా చేసే లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయ విభాగం ఏర్పాటైంది. వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఉండే ఈ విభాగంలో మండలస్థాయిలో కో-ఆర్డినేటర్లతోపాటు, ఎంపిక చేసిన గ్రామాల్లో రిసోర్సు పర్సన్ల ద్వారా ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు నిర్వహించే వారు. తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నంత వరకు (2019) ప్రకృతి వ్యవసాయ విభాగం కార్యక్రమాలు చక్కగా అమలయ్యాయి. సేంద్రియ విధానంలో పంటలను సాగు చేసే రైతులకు... రిసోర్సుపర్సన్ల ద్వారా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడం, అప్పటికే ఇతరచోట్ల పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను వారికి చూపించడం వంటి కార్యక్రమాలు అమలు చేసే వారు. ఘన/ ద్రవ జీవ ఎరువులు, కషాయాల తయారీ గురించి రైతులకు శిక్షణ ఇచ్చి, అనంతరం వారితోనే ఉత్పత్తి చేయించేవారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ఘన/ ద్రవ జీవామృతాల వాడకాన్ని పెంచేందుకు రిసోర్సు పర్సన్స్ కృషి చేశారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రకృతి వ్యవసాయ విభాగం పూర్తిగా నిర్వీర్యమైంది. సిబ్బందికి నెలల తరబడి గౌరవ వేతనాలు ఇవ్వలేదు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడానికి కేంద్రం ఇచ్చే నిధులను నాటి రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించడంతోపాటు, ఒకానొక దశలో ఈ విభాగాన్ని ఎత్తివేసేందుకు సిద్ధపడినట్టు తెలిసింది. వైసీపీ అధికారంలో నుంచి దిగిపోయే సమయానికి ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి 18 నెలల వేతనాలు బకాయి వున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రకృతి వ్యవసాయ విభాగాన్ని తిరిగి గాడిలో పెట్టే దిశగా చర్యలు ప్రారంభం అయ్యాయి. సిబ్బందికి ప్రతి నెలా గౌరవ వేతనం చెల్లించడంతోపాటు, పెండింగ్ వేతనాలను దశలవారీగా చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీంతో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు తిరిగి మొదలయ్యాయి.



ద్రవ జీవామృతం తయారు చేస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

జాతీయ మిషన్‌తో మరింత ఊపు

ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, కొన్ని సంస్థల ఆర్థిక సహకారంతో ప్రకృతి వ్యవసాయ విభాగం కార్యక్రమాలు నడిచేవి. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకృతి ... మిగతా 8వ పేజీలో

సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడ

మునిసిపల్ కమిషనర్ పేరుతో ఫోన్లు

- ఆస్తి పన్ను, బిజినెస్ లైసెన్స్ ఫీజులు వెంటనే చెల్లించాలని హుకుం
- అనుమానం వచ్చి.. కమిషనర్‌కు పలువురు ఫోన్లు
- స్పందించ వద్దని ప్రజలను కోరిన కమిషనర్ సరేంద్ర

నర్సీపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

డబ్బులు దోచుకోవడానికి సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగెడకు తెర లేపారు. ఏకంగా మునిసిపల్ కమిషనర్ పేరుతో ఫోన్ చేసి ఆస్తి పన్ను బకాయిలు, బిజినెస్ పన్నులు వెంటనే ఫోన్ పే ద్వారా చెల్లించాలని అడుగుతున్నారు. 75697 78380 నంబరుతో పట్టణంలో పలువురికి ఫోన్ కాల్స్ వచ్చాయి. ఫోన్ చేసి వ్యక్తి తాను మునిసిపల్ కమిషనర్‌గా పరిచయం ... మిగతా 8వ పేజీలో



రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా

పేదల ఇళ్ల స్థలాల లేఅవుట్లలో అక్రమంగా తవ్వకాలు

- రాత్రి పూట గ్రావెల్ తరలింపు
- వెదుళ్లనరవ, చుట్టుపక్కల స్టాక్ పాయింట్లు
- ప్రభుత్వం మారినా.. ఆగని గ్రావెల్ దందా
- చర్యలు తీసుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు



నంగినారపాడు లే-అవుట్లలో 10-15 అడుగుల లోతున గ్రావెల్ తవ్విన దృశ్యం

సబ్బవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని పలు గ్రామాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు జరపగా, ఆరు నెలల క్రితం ప్రభుత్వం మారినప్పటికీ అక్రమ తవ్వకాలు ఏ మాత్రం ఆగలేదు. పైగా గతంలోకన్నా మరింత పెరిగాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.



గంగవరంలో హెచ్‌టీ విద్యుత్ లైన్ కింద గ్రావెల్ తవ్వకాలు

సబ్బవరం మండలంలో గంగవరం, నంగినారపాడు, పైడివాడ, పైడివాడఅగ్రహారం గ్రామాల్లో గత ప్రభుత్వం అర్బన్ హౌసింగ్ స్కీమ్ (పీఎంఏవై) కింద వందల ఎకరాల్లో లే-అవుట్లు వేసింది. ఇవి బంజరు భూములు, కొండవాలు ప్రాంతాలు కావడం, లేఅవుట్లు వీఎంఆర్‌డీఏ పరిధిలో వుండడంతో కొంతమంది అక్రమార్కులు ఆయా లేఅవుట్లలో ఇష్టారాజ్యం గ్రావెల్ తవ్వుకున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు ప్రచురితమైనప్పటికీ అక్రమార్కులకు వైసీపీ నేతల అండదండలు వుండడంతో వారిపై చర్యలు తీసుకోవడానికి అధికారులు జంకారు. సాధారణ ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొద్దిరోజులపాటు గ్రావెల్ తవ్వకాలు నిలిచిపోయాయి. అక్రమార్కులకు, కూటమి నేతలకు అంతర్గతంగా ఏం ఒప్పందం జరిగిందో తెలియదుగానీ.. గ్రావెల్ తవ్వకాలు క్రమేపీ జోరందుకున్నాయి. వీటిపై మళ్లీ 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు రావడంతో ఇటీవల రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఆయా మార్గాల్లో గ్రావెల్ తరలింపునకు లారీలు, డంపర్లు రాకుండా వుండడానికి గోతులు తవ్వించారు. అయితే అక్రమార్కులు మరో మార్గాన్ని ఏర్పాటు చేసుకొని దర్జాగా గ్రావెల్ తరలించుకుపోతున్నారు. గంగవరం, నంగినారపాడుతోపాటు పరవాడ మండలం పెదగంట్యాడ లే-అవుట్లలో పది నుంచి 15 అడుగుల లోతున గ్రావెల్ తవ్వేస్తున్నారు. గంగవరం, నంగినారపాడు లే-అవుట్‌లలో ఏ లబ్ధిదారుడి ... మిగతా 8వ పేజీలో

తూరల రోడ్డుతో వెతలు

అధికారుల అనాలోచిత పనులతో మత్స్యకారుల ఇక్కట్లు

- హార్బర్‌కు వెళ్లడానికి ఉప్పుటేరుపై లోతట్టుగా కల్వర్టు నిర్మాణం
- చేపల పడవల రాకపోకలకు వీలుకాని పరిస్థితి
- రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి
- ఎత్తు వంతెన నిర్మించాలని మత్స్యకారులు వినతి



ఉప్పుటేరుపై తూరలతో వేసిన రోడ్డు, అవతల వైపు నిలిచిన బోట్లు

అచ్యుతాపురం, డిసెంబరు 12 (ఆంధ్యజ్యోతి):

మండలంలోని పూడిమడక పంచాయతీ పరిధిలో ఉప్పుటేరు మధ్యలో నుంచి ఫిషింగ్ హార్బర్‌కు తూరలతో రోడ్డు వేయడం వల్ల చేపల పడవలు గ్రామానికి దగ్గరగా తీసుకురాలేక ఇబ్బంది పడుతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు. దీనివల్ల రోజూ వంతెన వద్ద పడవలు నిలుపుదల చేసి రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుదని చెబుతున్నారు. ఉప్పుటేరులో పడవల రాకపోకలకు అనువుగా ఎత్తు వంతెన నిర్మించాలని అధికారులను కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే..

అచ్యుతాపురం మండలం పూడిమడక, రాంబిల్లి మండలం సీతపాలెం సరిహద్దుల నుంచి ఉప్పుటేరు ప్రారంభం అవుతుంది. మత్స్యకారులు దీనిని ఏటిమొగ/పొగిరి అంటుంటారు. ఉప్పుటేరు పూడిమడక గ్రామం చుట్టు సుమారు ఐదు కిలోమీటర్లు ప్రవహించి పూడిమడక శివారు కడపాలెం వద్ద కొత్తేరుతో చేరి సముద్రంలో కలుస్తుంది. కాగా అచ్యుతాపురం నుంచి పూడిమడక వరకు ప్రధాన రోడ్డు ఉంది. పూడిమడకకు సుమారు కిలోమీటరు దూరంలో ఉన్నత పాఠశాల వద్ద రోడ్డు చీలిపోయి రాంబిల్లి మండలం సీతపాలెం, లోవపాలెం, గజిరెడ్డిపాలెం, వెంకయ్యపాలెం, మీదుగా రాంబిల్లి వెళుతుంది. మరో రోడ్డు పెద్దూరు మీదుగా జాలారిపాలెం వద్దగల లైట్ హౌస్‌కి వెళుతుంది. లోవపాలెం రోడ్డుకి, జాలారిపాలెం లైట్ హౌస్‌కి మధ్య పెద్దూరు రుద్రభూమి దాటిన తర్వాత ఉప్పుటేరుపై ఒక వంతెన ఉంది. ఇక్కడి వరకు ఉప్పుటేరు లోతుగా వుంటుంది. దీంతో సముద్రంలో చేపల వేట అనంతరం పెద్దపెద్ద ఇంజన్ బోట్లు ఏటిమొగ ద్వారా పెద్దూరు వద్ద గల రుద్ర భూమి వరకు వచ్చేవి. మత్స్యకారులు ఇక్కడ నిలుపుదల చేసి, పడవల్లో నంచి ... మిగతా 8వ పేజీలో

ఉప్పుటేరుపై ఎత్తు వంతెన నిర్మించాలి



ఉప్పుటేరుపై తూరలతో రోడ్డు వేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఉప్పుటేరుకు ఇవతల వైపు పడవలు ఉండిపోయాయి. వాటిని ఉప్పుటేరు అవతల వైపునకు తీసుకువెళ్లాలంటే క్రేన్‌లు కావాలి. అలా తీసుకువెళ్లలేక చాలా మంది మత్స్యకారులు ఇవతల వైపునే పడవలను వదిలేశారు. వినియోగంలో లేకపోవడంతో అవి పాడైపోతున్నాయి. కూటమి ప్రభుత్వం ఈ సమస్యను పరిశీలించి, పడవల రాకపోకలకు అనువుగా ఉప్పుటేరుపై ఎత్తు వంతెన నిర్మించాలి.

తెడ్డు తాతారావు, మత్స్యకారుడు, జాలారిపాలెం

పాలిటెక్నిక్ లెక్చరర్‌పై పోక్సో కేసు

చోడవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలపై కెమిస్ట్రీ లెక్చరర్ సూరెడ్డి కనకారావుపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ విద్యార్థిని సోదరుడు, అతని స్నేహితులు కలిసి బుధవారం కాలేజీకి వచ్చి తరగతి గదిలో లెక్చరర్ కనకరావుపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనకు సంబంధించి ఇరుపక్షాలు చేసుకున్న ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ఓ విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు లెక్చరర్ కనకారావుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. లెక్చరర్‌పై దాడి చేసిన మకరాన కృష్ణ, విరోధి ధనుంజయ్, కొంపట్ల సాయికల్యాణ్, పీలా చైతన్యలపైనా కేసులు నమోదు చేసినట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు.

అన్నదాతలకు ఊరట

బలహీనపడుతున్న అల్పపీడనం

- భారీ వర్షాలు కురకపోవచ్చన్న సమాచారంతో ఉపశమనం
- అయినా వరి కోతలు వాయిదా వేసుకోవాలని అధికారులు సూచన



పాయకరావుపేట మండలం పెదరాంభద్రపురం కోతకు వచ్చిన వరి పైరు

అనకాపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడుతుందన్న వాతావరణ శాఖ ప్రకటనతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో గురువారం రోజంతా చల్లని వాతావరణం నెలకొంది. నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, రోలుగుంట, రావికమతం మండలాల్లో మబ్బులు కమ్ముకున్నాయి. కొన్ని మండలాల్లో మధ్యాహ్నం ఎండ కాసినప్పటికీ సాయంత్రం, ఉదయం వేళల్లో వాతావరణం చల్లగానే వుంది. జిల్లాలో ఎక్కడా వర్షాలు కురవకపోయినప్పటికీ శీతలగాలులు వీచాయి. రానున్న 24 గంటల్లో జిల్లాలో తేలికపాటి జల్లులు, అక్కడక్కడ ఒక మోస్తరు వర్షాలు కురిసే అకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అయితే భారీ వర్షాలు కురిసే అవకాశం లేదన్న సమాచారంతో అన్నదాతలు ఊరట చెందుతున్నారు. వారం రోజులపాటు వర్షాలు పడకపోతే వరి కోతలు పూర్తవుతాయని చెబుతున్నారు. కాగా వాతావరణంలో మార్పుల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌తోపాటు అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను మరో రెండు రోజులు కొనసాగించనున్నారు. మండల అధికారులు స్థానికంగానే వుండి అవసరం మేరకు సహాయక చర్యలు అందించాలని నిర్ణయించారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళవద్దని హెచ్చరించారు. రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు.

జిల్లా ప్రత్యేక అధికారిగా ప్రసన్న వెంకటేశ్



ప్రసన్న వెంకటేశ్, జిల్లా ప్రత్యేక అధికారి

అనకాపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

జిల్లా ప్రత్యేక అధికారిగా ప్రసన్న వెంకటేశ్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యా విభాగం కార్యదర్శిగా ఉన్న ఆయన.. అనకాపల్లి జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను పర్యవేక్షించనున్నారు. కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్‌ల ద్వారా సమావేశమై దిశా నిర్దేశం చేయనున్నారు.

మునగపాక పీహెచ్‌సీకి ల్యాబ్ మంజూరు

▸▸ స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే, అధికారులు



ల్యాబ్ వివరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

మునగపాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో ల్యాబ్ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. గురువారం ల్యాబ్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎమ్మెల్యేతోపాటు ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించారు. ఆరోగ్యకేంద్రం ముందు భాగంలో ఉన్న ఖాళీ స్థలం ల్యాబ్‌కు అనువైనదిగా గుర్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యరంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, ఆర్‌అండ్‌బీ అధికారులు, కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, దాడి ముసిలినాయుడు, టెక్కలి పరశరాం తదితరులు పాల్గొన్నారు.

'పేట' సబ్ ట్రెజరీని తనిఖీ చేసిన డీటీఓ



ఉద్యోగులతో మాట్లాడుతున్న డీటీఓ లక్ష్మీసుభాషిణి

పాయకరావుపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) :స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఖజానా, లెక్కల శాఖ అధికారిణి లక్ష్మీసుభాషిణి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం తనను కలిసిన నక్కపల్లి పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతూ పెన్షనర్లంతా జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు లైఫ్ సర్టిఫికెట్లను ట్రెజరీకి అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీఓ రాజేష్, సబ్‌ట్రెజరీ అఫీసర్ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు

పాయకరావుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన పెంచుకుని గ్రామాల అభివృద్ధికి సచివాలయ సిబ్బంది కృషిచేయాలని ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ హాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సచివాలయ ఉద్యోగులకు నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పనిచేసే సచివాలయ సిబ్బంది సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి అవకాశాలు, స్వయం సమృద్ధి, మౌలిక వసతులున్న గ్రామంగా అభివృద్ధి చేయాలన్నారు. అదేవిధంగా పారిశుధ్యం మెరుగు, పచ్చదనం, పరిశుభ్రత, చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్‌గా అభివృద్ధికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వైవీ.సత్యనారాయణ, పీఆర్ ఏఈ కచేరి, అధికారులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలు నేరం'

నక్కపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు గురువారం బాల్య వివాహాలు- వాటి వల్ల కలిగే దుష్ప్రరిణామాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శైలజ బాల్య వివాహాలు చేయడం నేరమని, వివాహ వయస్సు రాకుండా ఆడపిల్లలకు పెళ్లి చేస్తే వారి ఉజ్వల భవిష్యత్ నాశనమవుతుందన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్య మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించేందుకు మండల స్థాయిలో కమిటీలున్నాయని, వీటి నివారణకు చట్టాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీమన్నారాయణ, డి.త్రివేణి పాల్గొన్నారు.

హెటెరో నిధులతో డ్రైన్ల నిర్మాణం



డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

నక్కపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్‌ఎల్‌పురం గ్రామంలో హెటెరో ఔషధ పరిశ్రమ ఆధ్వర్యంలో రూ. 15 లక్షలతో డ్రైన్ల నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. సుమారు 270 మీటర్ల డ్రైన్లు నిర్మించాలని గ్రామస్థులు, పెద్దలు హెటెరో యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు యాజమాన్యం రూ.15 లక్షలు మంజూరు చేసింది. కంపెనీ ప్రతినిధులు ఎస్.కుల్లాయిరెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, ఎన్.రాజారెడ్డి, వీర వెంకట సత్యనారాయణరెడ్డి, సీహెచ్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు కర్రి అప్పారావు, సత్యనారాయణ, కొల్లాటి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించిన లోడుతో వెళుతున్న వాహనంపై కేసు

మునగపాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించిన లోడ్‌తో వెళుతున్న వాహనంపై కేసు నమోదు చేశామని స్థానిక ఎస్.ఐ పి.ప్రసాదరావు గురువారం తెలిపారు. అంతేకాకుండా వాహనాన్ని అధిక వేగంగా డ్రైవర్ నడిపారన్నారు. ఇందు నిమిత్తం రూ.68వేలు జరిమానా విధించామని చెప్పారు. హెచ్చరికలు చేస్తూనే ఉన్నా కొంత మంది పరిమితికి మించి లోడ్‌తో వాహనాలను వేగంగా నడుపుతున్నారన్నారు. అటువంటి వారిపై చర్యలు తప్పవన్నారు.

అట్రాసిటీ కేసులో నిందితుడి అరెస్టు

మునగపాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో కుంచవానిపాలెంలో కులం పేరుతో దూషించి, చంపుతానని బెదిరించిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ప్రసాదరావు గురువారం తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

తీవ్ర అల్పపీడనంతో అన్నదాతల్లో ఆందోళన

▸▸ వరి పనలు ఆరకుండానే కుప్పలు

▸▸ కోతలు వాయిదా వేసుకుంటున్న మరికొందరు



పెదరాంభద్రపురంలో కుప్పలు వేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వరి రైతుల్లో అలజడి మొదలైంది. ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట చేతికందే సమయంలో వర్షాలు కురిస్తే తీవ్రంగా నష్టపోతామని రైతాంగం భయపడుతోంది. ఇప్పటికే పంట కోతకు రావడంతో ఆలస్యమైతే వరి గింజలు రాలిపోతాయని ఆవేదన చెందుతోంది. రెండు, మూడు రోజుల వరకు వరి కోతలు వద్దని అధికారులు హెచ్చరిస్తున్నా కొంతమంది రైతులు తెగించి కోతలు కోస్తున్నారు. ఇప్పటికే కోతలు కోసిన రైతులు అప్రమత్తమై వరి పనలు ఆరకుండానే కుప్పలు వేస్తున్నారు. మండలంలో మంగవరం, సత్యవరం, పెంటకోట, గోపాలపట్నం, మాసాహెబ్‌పేట, శ్రీరాంపురం, పెదరాంభద్రపురం, అరట్లకోట, గుంటపల్లి, తదితర గ్రామాలలో సుమారు 3 వేల హెక్టార్లలో రైతులు వరిని సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి వాతావరణం అనుకూలించడంతో వరి పంట ఆశాజనకంగా పండింది. తుఫాన్ ప్రభావం లేకపోతే ఇప్పటికే కోతలు కోసేవారు. తీరా పంట పండిన తరువాత కోతలు కోసే సమయంలో అల్పపీడనం ఏర్పడడంతో రైతులు వరి కోతలను వాయిదా వేసుకుంటున్నారు. వరి కోతలు కోసే ముందు రైతులు అపరాలు జల్లుతారు. అయితే అల్పపీడన ప్రభావం వలన వర్షాలు కురుస్తాయని తెలపడంతో రైతులు ఇంకా అపరాలు కూడా చల్లకుండా ఎదురు చూస్తున్నారు.

సాగునీటి వ్యవస్థను నిర్వీర్యం చేసిన వైసీపీ

▸▸ రాష్ట్ర ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు

మునగపాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో సాగునీటి వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని, తిరిగి ఊపిరిపోసేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తోందని ఏపీ రోడ్లు డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక సహకార సంఘం ఫంక్షన్ హాలులో జరిగిన టీడీపీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాగునీటి కాలువలు దయనీయస్థితిలో ఉన్నాయంటే దానికి వైసీపీ పాలకులే కారణమన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీ శ్రేణులకు పోటీ చేసే నైతిక హక్కు లేదన్నారు. కూటమి నాయకులంతా సమిష్టిగా టీసీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌లు సొంతం చేసుకోవాలన్నారు. మండల పరిధిలోని 11 సాగునీటి సంఘాల పదవులను కూటమి మద్దతుదారులు కైవసం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి ముసిలినాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి మొల్లేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

నునపర్తి కూటమి నేతల్లో విభేదాలు

▸▸ గ్రామ కంఠంపై టీడీపీ, బీజేపీ నేతల మధ్య వివాదం

▸▸ ఆక్రమిస్తున్నారంటూ టీడీపీ ఫిర్యాదు

▸▸ విచారణకు వచ్చిన అధికారుల సమక్షంలో వాగ్వాదం

▸▸ ఎటూ తేల్చని అధికారులు

▸▸ నియోజకవర్గ నేతల దృష్టికి సమస్య



అధికారులతో వాగ్వాదానికి దిగిన సర్పంచ్ అనూరాధ

అచ్యుతాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నునపర్తిలో కూటమి నాయకుల మధ్య గ్రామ కంఠంపై వివాదం రేగింది. ఒక వర్గం అధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం విచారణకు వచ్చిన కింది స్థాయి అధికారుల సమక్షంలో ఇరువర్గాలు వాగ్వాదానికి దిగారు. దీంతో సోమవారం వరకు పనులు ఆపాలని చెప్పి అధికారులు వెనుదిరిగారు. వివరాల్లోకి వెళ్తే..

తెలుగుదేశం పార్టీకి కంచుకోట అయిన నునపర్తిలో మాజీ సర్పంచ్ చుక్క జోగినాయుడు మృతి చెందడంతో గత పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవమైంది. జోగినాయుడుపై సానుభూతితో అతని భార్య అనూరాధకు సర్పంచ్ పదవిని కట్టబెట్టారు. వార్డు మెంబర్లను టీడీపీ, వైసీపీ సమానంగా సర్దుకున్నారు. అప్పటి ఎమ్మెల్యే కన్నబాబు రాజు హవా ఎక్కువగా ఉండడంతో పంచాయతీ ఎన్నికలు జరిగిన తర్వాత ఒత్తిడి భరించలేక టీడీపీ శ్రేణులు కూడా వైసీపీ కండువా కప్పుకోవాల్సి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీ శ్రేణులు తిరిగి మాతృ పార్టీలో చేరగా, సర్పంచ్ అనూరాధ మాత్రం బీజేపీలో చేరారు. ఆది నుంచి రెండు వర్గాల మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల రజకులు వంశ పారంపర్యంగా బట్టలు ఉతకడానికి వినియోగిస్తున్న స్థలం తమదేనంటూ సర్పంచ్ వర్గీయులు వాదించగా.. టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. ఈ వివాదం సద్దుమణిగిన సమయంలో కొత్తగా గ్రామ కంఠం వివాదం తెరపైకి వచ్చింది. గ్రామం నడిబొడ్డున సామాజిక భవనానికి ఎదురుగా ఉన్న మూడు సెంట్ల భూమి ఎప్పటి నుంచో గ్రామ అవసరాలకు గ్రామస్థులు వినియోగిస్తున్నారు. అయితే ఈ భూమి తమదని, రికార్డులు కూడా ఉన్నాయంటూ సర్పంచ్ వర్గీయులు స్థలం ఆక్రమించడానికి ప్రయత్నించారు. దీంతో టీడీపీ శ్రేణులు బుధవారం గ్రామ కార్యదర్శి తోపాటు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఈఓపీఆర్డీతోపాటు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది గురువారం విచారణకు వెళ్లారు. ఈ సందర్భంగా ఇరువర్గాల వారు వాదోపవాదాలకు దిగడంతో అధికారులు చేతులెత్తేశారు. సోమవారం వరకు పనులను తాత్కాలికంగా నిలిపివేయాలని, ఈ విషయం మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళతామని, వారు సమస్యను పరిష్కరిస్తారని చెప్పి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని టీడీపీ నేతలు రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ వివాదం రసకందాయంలో పడింది.

అపరిశుభ్రతపై ఎమ్మెల్యే అసంతృప్తి

▸▸ మునగపాక పీహెచ్‌సీలో అన్ని విభాగాల పరిశీలన

▸▸ బాధ్యతగా ఉండాలన్న ఎమ్మెల్యే విజయకుమార్



స్టాక్‌రూమ్‌లో ఉన్న మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆర్యోగకేంద్రంలో అపరిశుభ్రతపై ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ సముదాయంలో అన్ని విభాగాలను గురువారం ఆయన పరిశీలించారు. రోగుల వార్డును చూసి మండిపడ్డారు. బిడ్డకు జన్మనిచ్చే గది ఇంత దయనీయంగా ఉంటే వారి ఆరోగ్య పరిస్థితి ఏమిటని వైద్యులను ప్రశ్నించారు. టాయిలెట్, బాత్‌రూమ్‌లు కూడా అపరిశుభ్రంగా ఉండడంతో ఇది పద్ధతి కాదని, పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మందుల స్టాక్‌రూమ్‌లోకి వెళ్లి పరిశీలించారు. ఓపీ, రిజిస్టర్ బుక్‌లను క్షుణంగా పరిశీలించారు. ఓపీలో కుక్కకాటు, పాముకాటు నమోదులు చూసి, వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయా అని వైద్యాధికారిణి విమలగిరిని అడిగి తెలుసుకున్నారు. అన్ని ప్రాంతాల్లో వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. పీహెచ్‌సీలో ఎన్ని రకాల పరీక్షలు చేస్తున్నది అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ ద్వారా అందిస్తున్న వైద్య సేవలు గురించి సీహెచ్‌వో ఆర్.దేవకాంత వివరించారు. అసంపూర్ణ నిర్మాణంలో ఉన్న భవనంలో ఉన్న కాలంచెల్లిన మందులు, ఇతర పరికరాలను ఏమి చేస్తారని ప్రశ్నించారు.

సబ్ స్టేషన్లు పరిశీలించిన ఎస్ఈ



కోటవురట్ల సబ్‌స్టేషన్ పరిశీలిస్తున్న ఎస్ఈ ప్రసాద్

కోటవురట్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములవాక, కోటవురట్ల విద్యుత్ సబ్ స్టేషన్లను ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం సబ్సిడీపై యూనిట్లు మంజూరు చేస్తుందన్నారు. వీటి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో లోవోల్టేజ్ సమస్య నివారణకు నర్సీపట్నం మండలం బలిఘట్టం ప్రాంతంలో 132 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేసినట్టు చెప్పారు. త్వరలో లోవోల్టేజ్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఈఈ రామకృష్ణ, కోటవురట్ల ఏఈ పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనపై శిక్షణ తరగతులు

కోటవురట్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు పల్లెల్లో అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథం అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, మండల అధికారులకు రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం లేని సమాజం, ఆరోగ్యవంతమైన సమాజం, శిశు మరణాల నివారణ, నీటి సమృద్ధి, పరిశుభ్రత, పచ్చదానం, తదితర 9అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ రఘురాం, ఎంపీహెచ్‌వో గోవిందరావు, ఏవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూములకు పరిహారం చెల్లించండి

▸▸ డీటీకి బార్క్ నిర్వాసితుల వినతి



అచ్యుతాపురం: తంతడిలో ఫిర్యాదు అందుకుంటున్న డీటీ శ్యామ్‌కుమార్

అచ్యుతాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమకు పరిహారం చెల్లించాలంటూ బార్క్ నిర్వాసితులు గురువారం తంతడిలో జరిగిన రెవెన్యూ సదస్సులో డీటీ శ్యామ్ కుమార్‌కి వినతి పత్రాన్ని ఇచ్చారు. ఉమ్మడి తంతడి పంచాయతీ పరిధిలోని 141, 238 సర్వే నంబర్లలో ఎనిమిదేళ్ల క్రితం ఏపీఐఐసీ భూములను సేకరించింది. సుమారు 325 మంది లబ్ధిదారులకు పరిహారం ఇవ్వడానికి నిర్ణయించింది. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడంతో పరిహారం పంపిణీ కాలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక వైసీపీ నాయకులు లబ్ధిదారుల జాబితాలను తారుమారు చేశారంటూ టీడీపీ ఆందోళన చేయడంతో అధికారులు పరిహారం పంపిణీ చేయలేకపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో దీనిపై సమగ్ర విచారణ జరిపి పరిహారం పంపిణీ చేయాలంటూ రైతులు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. అలాగే పాస్ పుస్తకాల కోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తంతడి సర్పంచ్ చోడిపల్లి మురళి, రాజాన నానాజీ, వై. రాజు, సీహెచ్ దేముడు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..



మునగపాక: సదస్సులో మాట్లాడుతున్న టి.సిరసపల్లి సర్పంచ్ ధనలక్ష్మి

మండలంలోని మాసాహెబ్‌పేట గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు జి. సత్యనారాయణ, అధికారులు రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సదస్సులో వివిధ భూ సమస్యలకు సంబంధించి 9 దరఖాస్తులను స్వీకరించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ త్రినాథ్, వీఆర్‌ఓలు, ఎంపీటీసీ సభ్యుడు కొంతం నరేశ్, టీడీపీ నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, వైసీపీ నాయకులు గెడ్డమూరి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

మండలంలోని పాములవాక రెవెన్యూ సదస్సులో రైతులనుంచి 31 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ తిరుమలబాబు తెలిపారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేసి 40 రోజుల్లోపు పరిష్కరిస్తానన్నారు. ఈ సదస్సులో టీడీపీ సీనియర్ నాయకుడు వేచలపు జనార్దన్, ఆర్ఐ, వీఆర్‌వో సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాకలో..

మండలంలో టి.సిరసపల్లి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి మాట్లాడుతూ కార్యాలయాల చుట్టూ తిరగనవసరం లేకుండా గ్రామాల్లోనే సదస్సులు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆదిఉమామహేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

▸▸ ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

అచ్యుతాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగితే సమాజం పురోభివృద్ధి చెందుతుందని ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ అన్నారు. గురువారం ప్రశాంతి విద్యాసంస్థల ప్రాంగణంలో మూడు రోజులపాటు జరిగే హస్తకళల అవగాహన, ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్తకళల్లో మహిళలే ఎక్కువగా రాణిస్తారన్నారు. ఈ సందర్భంగా హస్తకళలకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు. ఆభరణాల తయారీ, చెక్కతో చేసిన హస్తకళలు, మట్టి, వెదురు, కొబ్బరి చిప్పలు, సముద్రపు నత్తలు, శంఖాలు వంటి వివిధ హస్తకలల పట్ల ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డి. దేవి, సుదీప్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా వైసీపీ

▸▸ మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు



పోస్టర్‌ని విడుదల చేస్తున్న కంబాల జోగులు, తదితరులు

పాయకరావుపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నదాతలకు అండగా వైసీపీ ఉంటుందని, రైతుకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలని కోరుతూ గురువారం కలెక్టరేట్‌కు నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం ఇక్కడ వైసీపీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని, తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, నాయకులు ధనిశెట్టి తిరుమలేశ్వరరావు, జగతా శ్రీను, చోడిపల్లి అప్పన్న, చిక్కాల సూర్యనారాయణ, దేవవరపు రాజేష్‌ఖన్నా,నల్లబిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా కనకమహాలక్ష్మి పండుగ



కనకమహాలక్ష్మికి పూజలు చేస్తున్న మహిళలు

మునగపాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసంలో కనకమహాలక్ష్మి అమ్మవారి పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన పోలారపు నాగమణి, నారాయణరావు దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవం జరిగింది. కాలనీలో చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం మెయిన్‌రోడ్డుకు సమీపంలో చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు మహిళలు భారీగా తరలివచ్చారు. అన్నసమారాధన నిర్వహించారు.

అడిగిన సమాచారాన్ని 30 రోజుల్లో ఇవ్వాలి

రాంబిల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు అడిగిన సమాచారాన్ని 30 రోజుల్లో అందించాలని మండల వ్యవసాయాధికారిణి సిసుమంత అన్నారు. స్థానిక మండల పరిపరిషత్ కార్యాలయంలో గురువారం సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఆర్‌టీఐ యాక్ట్ 2005 గురించి, సెక్షన్ 4(1) సెక్షన్ 5, సెక్షన్ 6(3), సెక్షన్ 7(1), సెక్షన్ 8(1) ప్రకారం ఇవ్వాల్సిన సమాచారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయమాధవి, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీల సెక్రటరీలు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన రజాల సర్పంచ్



జనసేనలో చేరిన వారితో ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం/రాంబిల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి మండలం రజాల పంచాయతీ సర్పంచ్ కొన్నాడ వరలక్ష్మి(వైసీపీ), ఆమె భర్త శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ సత్తిబాబుతోపాటు కొందరు వార్డు మెంబర్లు గురువారం అచ్యుతాపురం ఎమ్మెల్యే స్వగృహంలో జనసేన పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా జగన్‌తోపాటు మరి కొందరి వైసీపీ నాయకుల్లో మార్పు రాలేదన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండలశాఖ అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, దిమిలి మాజీ సర్పంచ్ కొటాపు వడ్డీకాసులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు బలిరెడ్డి జనార్దన, నేతలు బొద్దపు బాస్కరరావు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనను సందర్శించిన ప్రముఖులు

ఎలమంచిలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగుపాలెం ఎల్‌ఈఎఫ్ చర్చి ఆవరణలో ఐదు రోజులపాటు నిర్వహించే క్రైస్తవ పుస్తక ప్రదర్శనను గురువారం ఉత్తరాంధ్ర జిల్లాల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు యోహాను బృంద సభ్యులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో జాషువ మధు. సురేష్, బి.యేసు, సువార్తికులు ప్రసాద్, యేసుబాబు. జాన్‌మార్క్ పాల్గొన్నారు.

కనకమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎలమంచిలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ధర్మవరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి గురువారం తెల్లవారుజాము నుంచి మహిళలు పోటెత్తారు. అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు, అర్చనలు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొరారు సాంబ, ఇతర ప్రతినిధుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సంక్రాంతిలోగా గుంతలు లేని రోడ్లు

ఆర్‌అండ్‌బీ డీఈఈ విద్యాసాగరరావు



నర్సీపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో సంక్రాంతి పండగ నాటికి గుంతలు లేని రోడ్ల పనులు పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ డీఈఈ ఆర్‌ఆర్.విద్యాసాగరరావు తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్‌లో రూ.2.67 కోట్లతో 60 పనులు చేపట్టామన్నారు. 495.8 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్లలో 138.7 కిలోమీటర్లు గుంతలు ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. ఇప్పటికే తొమ్మిది పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులను వచ్చే నెల 15వ తేదీ నాటికి పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

నర్సీపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపూడి గ్రామంలో గురువారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నవ్య లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ముగ్గురు వైద్యులు, ఆరుగురు పారామెడికల్ సిబ్బంది సేవలు అందించారు. వంద మందికి కంటి పరీక్షలు చేసి దోషాలు గుర్తించారు. శస్త్ర చికిత్సకు ఎంపిక చేసిన వారిని ప్రత్యేక బస్సులో విశాఖపట్నం తరలించారు. శస్త్ర చికిత్స చేసిన తర్వాత నెల రోజులకు సరిపడా మందులు, ఉచితంగా కళ్ల అద్దాలు అందజేస్తారని నవ్య లయన్స్ క్లబ్ ప్రతినిధి చింతకాయల సన్యాసిపాత్రుడు తెలిపారు. ఈ శిబిరంలో క్లబ్ సభ్యులు గొలుసు శ్రీనివాసరావు, చెరుకూరి ఇందిరా, చెరుకూరి సతీశ్ బేతిరెడ్డి విజయ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

తహసీల్దార్ శ్రీనివాసరావు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరరావు సూచించారు. మండలంలోని చోద్యం గ్రామంలో సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ అధ్యక్షతన గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకాల్లో విస్తీర్ణం ఎక్కువ, తక్కువ, పేర్ల మార్పులు కోసం ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వీటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైనులు, మండల సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ నాగరాజు, వీఆర్‌వో శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో తప్పులు సరిచేయరూ..

మాకవరపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో భూముల అన్‌లైన్‌లో తప్పుల తడకలుగా ఉన్నాయని, వాటిని సర్వే చేసి వెంటనే సరిచేయాలని తామరం గ్రామానికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు టీడీపీ సీనియర్ నాయకుడు కోసూరు శ్రీనివాసురావుతో కలిసి గురువారం రెవెన్యూ డీటీకి వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్లలో ఇష్టారాజ్యంగా భూముల అన్‌లైన్ ప్రక్రియ జరిగిందని, దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. దీనిపై డీటీ కృష్ణమూర్తి స్పందిస్తూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికే ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వినతిపత్రం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శాంతికుమారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వారపు సంత.. ట్రాఫిక్ చింత!

- ఏఎల్‌పురం సంతకు స్థలం, సదుపాయాలు కరువు
- రోడ్లుపైనే దుకాణాలు.. వాహనాల రాకపోకలకు ఆటంకం
- పట్టించుకోని అధికారులు



కృష్ణాదేవిపేట రహదారిపైనే ఏర్పాటు చేసిన దుకాణాలు



రహదారి మధ్యలో చిక్కుకుపోయిన బస్సులు, ట్రాక్టర్లు, బైకులు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్‌పురం వారపు సంతతో వాహన చోదకులు నరకం చూస్తున్నారు. ప్రతీ సోమవారం జరిగే ఈ సంత నిర్వహణకు సొంత స్థలం లేకపోవడంతో రహదారిపైనే వ్యాపారులు, వినియోగదారులు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక రామాలయం వద్ద, మెయిన్ రోడ్డుపై ఏళ్ల తరబడి కూరగాయాలు, మాంసం, ఇతర దుకాణాలు నిర్వహిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. సంత సమయంలో గిరిజన, మైదాన ప్రాంతాల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో సంత మార్చేందుకు ఉన్న ప్రభుత్వం స్థలాన్ని వైసీపీ నాయకులు, పాలకులు జగనన ఇళ్ల స్థలాలకు ఇచ్చేశారు. దీంతో వారపు సంతకు సరైన స్థలం లేకపోయింది. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ప్రజలు, వ్యాపారులు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. మండలంలో చిన్న చిన్న పంచాయతీలకు వారపు సంతలో ప్రత్యేక స్థలం కేటాయించి షెడ్లు వేసి వ్యాపారులకు అందిస్తున్నారు. వంద గిరిజన, మైదాన గ్రామాల ప్రజలు వచ్చిపోయే ఏఎల్‌పురం సంతకు స్థలం సదుపాయాలు లేకపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో గత్యంతరం లేక రహదారిపైనే దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్ స్తంభించిపోయి వాహన చోదకులు నరకం చూస్తున్నారు. ఈ సమస్య అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాల పరిశీలన

గొలుగొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను ఎంఈవో-2 మూర్తి బృందం గురువారం పరిశీలించారు. అంబేడ్కర్ గురుకుల కళాశాల, చీడిగుమ్మల, ఏఎల్.పురం ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు, మౌలిక సదు పాయాలపై ఆరా తీశారు. ఈ ఏర్పాట్లపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని ఎంఈవో-2 మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు జి.శ్రీరామ్మూర్తి, ప్రసాద్ పాల్గొన్నారు.

సమ్మె ఒప్పందంలో అంశాలు నెరవేర్చాలి

నర్సీపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల 42 రోజులు సమ్మె ఒప్పందంలోని అంశాలను ప్రభుత్వం పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో సూర్యనారాయణకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అవలు చేయాలని కోరారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయడానికి జీవో ఇవ్వాలని విన్నవించారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులకు రూ.20 వేలు మంజూరు చేయాలని ఇంటిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రాజాన దొరబాబు, అధ్యక్షురాలు రొంగల సత్య, కార్యదర్శి నవర మణి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి: తహసీల్దార్

నాతవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలోని పది మేజర్ సాగునీటి సంఘాలకు, ఏడు మైనర్ సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. మేజర్ సాగునీటి సంఘాలలో 120 మంది, మైనర్ సాగునీటి ఎన్నికలలో 142 మంది పోటీ చేస్తారని తెలిపారు. మొత్తం 162 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 20211 మంది రైతులు ఓటు వేయనున్నారని చెప్పారు. వీరిలోఓ 13252 మంది పురుషులు, 6959 మంది మహిళా రైతులు ఉన్నారన్నారు. రైతులు సాగునీటి ఎన్నికలలో పాల్గొని ఓటును సద్వినియోగం చేసుకోవాని కోరారు. ప్రభుత్వం కొత్తగా ఎన్నికైన నీటి సంఘాల అధ్యక్షుల ద్వారా పంట కాలువలు, చెరువులను అభివృద్ధి చేయనున్నట్టు ఆయన చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మణికుమారి

సభ్యుల అభ్యంతరంతో మండల సమావేశం వాయిదా

గొలుగొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సభ్యుల అభ్యంతరంతో వాయిదా వేశారు. కోరం లేకపోయినప్పటికీ సమావేశం నిర్వహిస్తుండగా సభ్యులు అడ్డుకున్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించేందకుగాను అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఎంపీటీసీ సభ్యులు 15 మందిలో కనీసం ఎనిమిది మంది సభ్యులు సభకు హాజరుకావల్సి ఉంది. కాని ఐదుగురు సభ్యులే వచ్చారు. అయినప్పటికీ సభను నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ మణికుమారి ప్రకటించారు. దీనికి ఏఎల్.పురం ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ అడ్డుపడ్డారు. కోరం లేకుండా సభను ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. దీంతో వాయిదా వేస్తున్నట్టు ఎంపీడీవో మేరీరోజీ తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకట గిరిబాబు, డీటీ చైన్లు, పలు శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి'



మాట్లాడుతున్న పంచాయతీ విస్తరణాధికారి మూర్తి

నాతవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ఉద్యోగులు ప్రజలలోకి తీసుకు వెళ్లాలని పంచాయతీ విస్తరణాధికారి ఎన్‌వీవీఎస్.మూర్తి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఇతర శాఖల అధికారులకు సుస్థిర లక్ష్యాలను ఆసరా చేసుకుని గ్రామాలను ఎలా అభివృద్ధి చేయాలన్న అంశంపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పేదరిక నిర్మూలన ఎలా చేయాలి, ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు సురక్షిత తాగునీరు ఎలా అందించాలి తదితర విషయాలను వివరించారు. విద్యుత్ శాఖ ఏఈ చంద్రమౌళి మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను వినియోగించుకుని, విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ పథకాలను వివరించారు. సమావేశంలో మండల పరిషత్ ఏవో పి.పార్థసారధి, వెలుగు ఏపీఎం కనకరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దేవదత్తు, డాక్టర్ ప్రసన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాకవరపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ డీఈ రామకృష్ణారావు తెలిపారు. 33/11 కేవీ ఫీడర్ మరమ్మతు పనులు చేపడుతున్న సందర్భంగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్ర 4 గంటల వరకు మాకవరపాలెం, బుల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్, తామరం, రాచపల్లి జంక్షన్, కొత్తపాలెం, అవంతి కళాశాలల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. అలాగే 11 కేవీ గిడుతూరు ఫీడర్ పరిధిలోను, బయ్యవరం, జి.వీర్ అగ్రహారం, పీపీ అగ్రహారం, నారాయణరాజుపేట, బీఎస్.పేట, రామన్నపాలెం, జంగాలపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే 11 కేవీ జి.కోడూరు ఫీడర్ పరిధిలోని రాచపల్లి, జి.కోడూరు, జి.నగరం, సుభద్రయ్యపాలెం, చౌడవాడ, బూరుగుపాలెం ఫీడర్ పరిధిలోని పైడిపాల, పెద్దిపాలెం, వెంకటాపురం, చామంతిపురం, బూరుగుపాలెం, కె.తాడపాల, తాడపాల, తూటిపాల, కెతూటిపాల గ్రామాల్లో విద్యుత్ ఉండదని ఆయన తెలిపారు. ఆయా గ్రామాల్లో ఈ సమస్యను గుర్తించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

'హెల్మెట్ లేకుంటే కేసులు తప్పవు'

కృష్ణాదేవిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేయక తప్పదని ఎస్ఐ వై.తారకేశ్వరరావు హెచ్చరించారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలబారిన పడకుండా ఉండాలంటే హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. దీనిపై వాహనదారులు అవగాహన కలిగి ఉంచాలని ఆయన సూచించారు.

వేములపూడిలో రెవెన్యూ సదస్సు

నర్సీపట్నం రూరల్ , డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపూడి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ రామారావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సదస్సులో వివిధ సమస్యలపై 13 వినతులు అందినట్టు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు బోళెం రాంప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీరంగస్వాతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తురువోలు విద్యార్థి ఎంపిక



కౌశల్ పోస్టర్‌ప్రజంటేషన్ పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

చీడికాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురువోలు హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న సుంకర ప్రసన్నకుమార్ కౌశల్‌పోస్టర్ ప్రజంటేషన్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానో పాధ్యాయుడు కె.రామకృష్ణారావు, గైడ్‌గా వ్యవహరించిన మాధవి గ తెలిపారు. ఈ ఏడాది ఈ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కాగా, వారిలో తమ పాఠశాల విద్యార్థి ఉండడం ఆనందంగా ఉందన్నారు. ఈ నెలాఖరున విజయవాడలో జరిగే పోటీకి హాజరుకానున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు జీపీప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల అండతోనే ఇసుక దందా

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

దేవరాపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణా అధికారుల అండ దండలతోనే సాగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న ఒక ప్రకటనలో ఆరోపించారు. మండలంలోని శారదానది ఆనుకొని ఉన్న పరీవాహక ప్రాంతాల్లో విచ్చల విడిగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక అక్రమ వ్యాపారులకు అనుకూలంగా మారిందన్నారు. దీంతో ఇసుక మాఫియా రెచ్చిపోతోందన్నారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగంకు అక్రమ రవాణాదారులు ముడుపులు చెల్లిస్తున్నట్టు ఆరోపించారు. అందుకే వారు మిన్న కుండి పోతున్నారన్నారు. వాల్టా చట్టాన్ని లెక్క చేయలేదన్నారు. తిమిరాం, తారువ, కలిగొట్ల, బి.కింతాడ, వేచలం, చింతలపూడి, తామరబ్బ, వెంకటరాజపురం, తెనుగుపూడి గ్రామాల నుంచి ఇసుక విజయనగరం జిల్లాల గ్రామాలకు తరలిపోతోందన్నారు. ఉన్నత అధికారులు స్పందించి ఉచిత ఇసుక విధానానికి ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగావ్యవహరించాలన్నారు. ఇసుక రవాణాలో ట్రాక్టర్ డ్రైవింగ్ మైనర్ యువకులు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

లక్ష్మమ్మకు మార్గశిర గురువారం పూజలు



లక్ష్మమ్మ తల్లి



దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

చోడవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మమ్మ ఆలయంలో మార్గశిర మాసం రెండవ గురువారం సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. తెల్లవారుఝామునుంచి అధిక సంఖ్యలో భక్తులు చేరుకోవడంతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ కోశాధికారి నున్న గోపాలం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.కోటపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని ఏ.కోడూరు ఫీడర్‌లో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ సబ్‌స్టేషన్ అసిస్టెంట్ ఇంజినీర్ ఎం. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏ. కోడూరు, పొడుగుపాలెం, సూరెడ్డిపాలెం, సింగన్నదొరపాలెం, కొత్త అగ్రహారం, రామచంద్రపురంలో ప్రజలు సహకరించాలన్నారు.



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు



చీడికాడలో మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందరరావు

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా పంచాయతీల అభివృద్ధికి అందరూ కలిసిరావాలని స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు అధికారులతో నిర్వహించిన పంచాయతీలు సమగ్రాభివృద్ధి అనే అంశంపై శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను తీసుకుని వస్తానని, ఏ ఒక్క పని అసంపూర్తిగా మిగిలిపోకుండా ఐదేళ్లలో పూర్తి చేయాలన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి రోడ్లు, కాలువలు ఇతర అభి వృద్ధి పనులకు అందరూ ముందుకు రావాలని కోరారు. అందరికీ తాను అందుబాటులో ఉంటానని, పల్లెలను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ఈ సందర్భంగా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ప్రతిపాదనలు రూపొందించాలని ఎండీవో పీవీ ఎస్‌జే అంజనేయులు స్థానిక నేతలకు విజ్ఞప్తి చేశారు. వార్డుల వారీగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహించి సమస్యలు శాశ్వతంగా పరిష్కారం చూపాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, ఈవోపీఆర్‌డీ మహేష్, పంచాయతీ ఈవో నారాయణరావు, వివిధ శాఖల అధికారులు సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

కె.కోటపాడు: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ అభివృద్ధి వైపు అడుగులు వేయాలన్న సంకల్పంతో సచివాలయ సిబ్బందికి సమావేశమందిరంలో గురువారం శిక్షణ ఏర్పాటు చేశారు. మండల పరిషత్ పరిపాలనాధికారి సబ్బి అప్పలరాజు కోర్స్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. మండలంలో ఉన్న 32 గ్రామ పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించి ప్రభుత్వ ఆదేశాలను పాటించాలన్నారు. ఇంటింటి సర్వేతో పాటు బ్యాంకు ఖాతా, ఆధార్ లింకింగ్, పాఠశాలలు, ఆశ్రమ వసతి గృహ తనిఖీలు, గ్రామసభల ఏర్పాటు, న్యాయపరమైన సుపరిపాలన, పల్లెల్లో పచ్చదనం, తాగునీరు, స్వయం సమృద్ధి, సంపద కేంద్రాల నిర్వహణ తదితర 17 లక్ష్యాలను ఎంపిక చేసి వాటిపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ శిక్షణకు పంచాయతీ విస్తరణ అధికారి రమణి, అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఈ శిక్షణలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, వెలుగు ఏపీఓ చినబాబు, మండల ఇంజినీర్ సుమతి, సీడీపీఓ మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో..

చీడికాడ: సుస్థిర లక్ష్యాల సాధనకు అందరూ ముందుకురావాలని ఎంపీడీవో వి.హేమసుందర్రావు కోరారు. ఈ మేరకు సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ గురువారం ప్రారంభమైంది. ఎంపీపీ కురచా జయమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ, సుస్థిర అభివృద్ధిలో భాగంగా 17 లక్ష్యాలు ఉన్నాయన్నారు.

వీటిలో ముఖ్యంగా పేదరికంలేని సమాజం, అందరికీ విద్య, సంపూర్ణ ఆరోగ్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, ఉపాధి కల్పన తదితర అంశాలపై ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో అందరూ భాగ స్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కామే శ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కనకమ్మ, ఏపీఎం కనకమ్మ, హెల్త్ ఎంపీ హెచ్‌వో జి. వెంకటరావు, పంచాయతీరాజ్ ఏఈ శరగడం పరదేశినాయుడు, టీపీటీ పట్నాలగోపి తదితరులు పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా

నలుగురికి గాయాలు

కశింకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తేగాడ మోడల్ స్కూలు సమీపంలో కుక్కను తప్పించబోయి అటో బోల్తా పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికుల సహాయంతో అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో నలుగురు ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. మిగిలిన ఇద్దరిలో ఒక మహిళ ఉన్నారు. అయితే, గాయపడిననాలుగురిలో ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పారు.

చెరకు రైతుల సమస్యలు పట్టించుకోవాలి

ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి



అప్పలరాజు

చోడవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోవాడ సహకార షుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతుల సమస్యల పరిష్కారానికి కూటమినేతలు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గోవాడ చెరకు రైతుల బకాయిలు త్వరలో చెల్లించి ఫ్యాక్టరీని ఆదుకుంటామని గోవాడ మహాజన సభలో ప్రకటించిన ఎమ్మెల్యే రాజు, నెలలు గడచినా బకాయిల సంగతి పట్టించుకోలేదని విమర్శించారు. కనీసం కార్మికులు శ్రేయస్సు, ఫ్యాక్టరీ క్రషింగ్‌పై కానీ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. చెరకు రైతుల గిట్టుబాటు ధరపైనా హామీలు ఇచ్చిన జనసేన నేత రాజు సైతం ఈ విషయంపై మాట్లాడకపోగా, ప్రకటనలతో కాలయాపన చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై ఇకనైనా ఒత్తిడి తీసుకువచ్చి గోవాడ ఫ్యాక్టరీలో సమస్యలను పరిష్కరించడంతో పాటు, రైతుల బకాయిలు వెంటనే చెల్లించాలని అప్పలరాజు డిమాండ్ చేశారు.

చెరువులో ఆక్రమణల తొలగింపునకు చర్యలు



గొంప మిరియాల చెరువును పరిశీలిస్తున్న రెవెన్యూ,పోలీస్ అధికారులు

రావికమతం, డిసెంబరు 12,(ఆంధ్రజ్యోతి): మండలంలో గొంప మిరియాల చెరువులో అక్రమణలను తొలగించనున్నట్టు తహసీల్దార్ బి.వెంకట రమణ తెలిపారు. ఈ చెరువు అక్రమణలపై గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు ఆయకట్టు భూములకు సాగు నీరు అందక ఏటా పంటలు నష్టపోతున్నామని ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే చెరువును తహసీల్దార్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది, పోలీసులు కలసి వెళ్లి పరిశీలించారు. ఈ చెరువు గర్భంలో సగం మేర ఆక్రమించి సుమారు 15 మంది ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. ఈ అక్రమణలను తక్షణమే తొలగించాలని సిబ్బందిని తహసీల్దార్ ఆదేశించారు. త్వరలోనే మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉన్న ఈ చెరువును ఇరిగేషన్ అధికారుల సమక్షంలో పూర్తిస్థాయి సర్వే నిర్వహించి, హద్దులు నిర్ధారిస్తామన్నారు. ఈ చెరువును ఉపాధిహామీ పథకంలో అభివృద్ధి చేయించాలని ఎంపీడీవో భానోజీరావును ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.గోవింద, ఆర్ఐ సతీష్, ఏఎస్ఐ ప్రసాద్, వీఆర్‌వో తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో హైపర్ ఆది సందడి



అభిమానులకు అభివాదం చేస్తున్న ఆది

నర్సీపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జబర్దస్త్ ఫేమ్ హైపర్ ఆది నర్సీపట్నంలో సందడి చేశారు. పెదబొడ్డేపల్లిలో ఓ మాంసాహార హోటల్ ప్రారంభోత్సవానికి శాంతి స్వరూప్, వినోదినితో కలిసి ఆది హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా పేలస్ నుంచి పెదబొడ్డేపల్లిలో హోటల్ వరకు కారులో అభిమానులకు అభివాదం చేసుకుంటూ వెళ్లారు. వారిని చూడడానికి జనం ఎగబడ్డారు.

డిగ్రీ కాలేజీలో సేవా కార్యక్రమాలు



టీషర్టులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు, తదితరులు

చోడవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం విశాలాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు ప్రారంభించారు. ఇందులో భాగంగా జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ సంస్థ సహకారంతో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నేషనల్ ట్రైనర్ డి. రామేశ్వరరావుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనం తరం విశాలాక్షి ఫౌండర్ శ్రీనివాస గుప్తా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజు కాలేజీ క్రీడాకారులకు స్పోర్ట్స్ టీ షర్టులు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదతరులు పాల్గొన్నారు.

నృసింహస్వామి మాలధారణ



భక్తులకు మాలధారణ వస్త్రాలను అందిస్తున్న గురుస్వాములు

ముంచంగిపుట్టు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):స్థానిక రామాలయంలో సింహాచలం సింహాద్రి మట్టం గురుస్వామి కసిరెడ్డి సురేంద్ర సహకారంతో స్థానిక గురుస్వాములు దొన్నో, సీతారాం ఆధ్వర్యంలో చందన మాలధారణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 284 మంది భక్తులు నృసింహస్వామి చందన మాలలను ధరించారు. ఇందుకు అవసరమైన దుస్తులు, మాలలు, ఇతర సామగ్రిని సింహాచలం దేవస్థానం వారు ఉచితంగా అందించినట్లు గురుస్వాములు తెలిపారు.మాల ధరించిన వారంతా శ్రీమన్నారాయణ అంటూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

గంజాయి సాగు వద్దు: ఎస్‌ఐ



పిల్లిగెడ్డలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న సీలేరు ఎస్‌ఐ రవీంద్ర

సీలేరు, డిసెంబరు 12, (ఆంధ్రజ్యోతి) : గంజాయి సాగు, రవాణా వంటి వంటి పనులకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ రవీంద్ర అన్నారు. జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పిల్లిగెడ్డ గ్రామంలో గురువారం గిరిజనులకు గంజాయి, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, సారా తదితర వాటిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో గంజాయి రవాణాతో ఎంతో మంది యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈస్థితిలో గంజాయి దూరం కావాలన్నారు. సాంప్రదాయ పంటలపై దృష్టిసారించాలని కోరారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బు పోగొట్టుకుంటున్నారన్నారు. ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహన దారులకు లైసెన్సులు ఉండాలన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చరించారు. గ్రామంలో ఎవరైనా సారా తయారీ, అమ్మకాలు జరిపినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ గిరిజనులను హెచ్చరించారు

నేడు వివిధ మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్ డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు మండలాల్లో 13వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని స్థానిక విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏఈఎస్ఎం అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. చింతపల్లి మండలం లోతుగెడ్డ ఫీడర్ పరిధిలోని లోతుగెడ్డ, వంగసార, కిన్నెర్ల, కొమ్మంగి, కొత్త పాలెం గ్రామాలకు, జి.మాడుగుల మండలం కొక్కిరాపల్లి ఫీడర్ పరిధిలోని కొక్కిరాపల్లి, తాళ్లమామిడి, వంజరి, దేవరాపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

యాగశాల నిర్మాణానికి భూమి పూజ



ఉమామహేశ్వర ఆలయంలో భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

సీలేరు, డిసెంబరు 12, (ఆంధ్రజ్యోతి): జీకే వీధి మండలం సీలేరు ఉమామహేశ్వర ఆలయంలో యాగశాల నిర్మాణానికి గురువారం భూమి పూజను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేద పండితుడు ధనుంజయ్‌శాస్త్రి శాస్త్రోక్తంగా వానపల్లి అప్పారావు దంపతులతో ఈ శంకుస్థాపన కార్య క్రమం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, పంప్డ్‌స్టోరేజీ ఈఈ భాస్కర రావు, ఏడీఈ అప్పలనాయుడు, ఉప సర్పంచ్ కే వల్లీప్రసాద్, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, ఆలయ కమిటీ కార్యదర్శి నాగేశ్వర రావు, సభ్యులు లక్ష్మణ, టి. విష్ణుకుమరార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌కు శంకుస్థాపన

జి.మాడుగుల, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థులు అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సుర్మతి పంచాయతీ సర్పంచ్ సూరిబాబు సూచించారు. గ్రామ సమీపాన మంజూరైన చెక్‌డాంను ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దేవుడమ్మ, చిన్నమ్మ, కోటిబాబు, వెంకన్నపడాల్ పాల్గొన్నారు.



అంజలి రిసార్ట్స్ ఎదుట ఛిద్రమైన రహదారి



పానిరంగిని రైల్వేవంతెన సమీపంలో శిథిలమైన రోడ్డు

నాణ్యతకు తూట్లు.. ప్రయాణికులకు పాట్లు

» నిర్మించిన కొన్నాళ్లకే అరకులోయ ఆర్‌ఐటీఐ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు ఛిద్రం » రూ. 25 కోట్ల వ్యయం.. » ప్రయోజనం అంతంతమాత్రం

వెనకటికెవరో పందిరి వేస్తే పిచ్చుకలు కూలదోశాయట. ఇదే 'పనితనం' అరకులోయ ఆర్‌ఐటీఐ నుంచి రైల్వేస్టేషన్ వరకు రహదారి నిర్మాణం లోనూ కనిపిస్తోంది. నిర్మించిన కొన్నాళ్లకే పెచ్చులూడి నాణ్యతను వెక్కిరిస్తోంది. రూ. కోట్ల ప్రజాధనం ఇలా రహదారి నిర్మాణం రూపంలో దుర్వినియోగమైంది. ఐదేళ్లపాటు రహదారి నిర్వహణ బాధ్యతలను గాలికి వదిలేసిన కాంట్రాక్టర్‌పైనా ఏ చర్యలూ లేవు.

అరకులోయ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ఆర్‌ఐటీఐ నుంచి రైల్వేస్టేషన్ వరకు అరకులోయ సుందరీకరణలో భాగంగా నిర్మించిన 5 కిలోమీటర్ల డబుల్‌రోడ్ నిర్వహణ లేక చాలాచోట్ల గతుకులమయంగా మారింది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సీఎం దత్తత గ్రామం పెదలబుడు పరిధిలో ఉన్న అరకులోయ పట్టణాన్ని సుందరీకరణకు ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆర్‌ఐటీఐ నుంచి రైల్వేస్టేషన్ వరకు రహదారికి రూ. 24 కోట్లు మంజూరు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమైనా, మధ్యలో అసెంబ్లీ ఎన్నికలు రావడం, ఆ పార్టీ పరాజయం పాలైంది. తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అనంతరం కరోనాతో రెండేళ్లు పనులు నిలిచిపోయాయి. అనంతరం బిల్లులు కాకపోవడంతో ఏడాదిపాటు పనులు ఆపేశారు. అనంతరం ఎట్టకేలకు పనులు పూర్తిచేసిన నాలుగేళ్లకే రహదారి మరమ్మతుల పాలైంది. విడుదలైన నిధుల్లో 5 కిలోమీటర్ల పరిధిలో రూ.10 కోట్లతో రెండు చోట్ల వంతెనలు నిర్మించాల్సి ఉంది. కానీ, వైసీపీ ప్రభుత్వం చేపట్టిన పనులకు బిల్లుల చెల్లించడం కష్టతరంగా మారడంతో వంతెన నిర్మాణపు పనులు ప్రారంభానికి నోచుకోలేదు. మరోవైపు పనుల్లో నాణ్యత లోపించి రహదారి మరమ్మతు పాలవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఐదేళ్లలోపు రహదారి మరమ్మతుకు గురైతే నిర్మించిన గుత్తేదారుడు నిర్వహణ పనులు (మెంటైనెన్స్)విధిగా చేపట్టాల్సి ఉంది. ఆయన ఆ బాధ్యత నిర్వహించే పరిస్థితి కానరాలేదు. ఫలితంగా పలుచోట్ల రహదారి కుంగిపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ డిసెంబరుతో గుత్తేదారుడు నిర్వహణ కాలవ్యవధి ముగిసిపోతున్నా ఆర్‌అండ్‌బీ అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం. ఇకనైనా గుత్తేదారునితో ఈ రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టాలని స్థానిక నేతలు,వాహనచోదకులు డిమాండ్ చేస్తున్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు దోహదం

» ఎంపీపీ రత్నకుమారి

పాడేరురూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై అందిస్తున్న శిక్షణతో గిరిజన గ్రామాలు మరింత అభివృద్ధి పదంలో ముందుకు సాగుతాయని ఎంపీపీ ఎస్. రత్నకుమారి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి ప్రణాళికపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదరికం లేని వెరుగైన జీవనోపాదుల గ్రామం, ఆరోగ్యకరమైన గ్రామం, పిల్లల స్నేహపూర్వక గ్రామం, నీటి సమృద్ధి కలిగిన గ్రామం, పరిశుభ్రమైన హరిత గ్రామం, స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు, సమాజిక న్యాయం, భద్రత తదితర అంశాలను గ్రామ స్థాయిలో అమలుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమాలలో ఈవోపీఆర్‌ఆర్‌డీఆర్‌వీఎస్.రమేష్, 26 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్షాల సాధనకు కృషి చేయాలి

చింతపల్లి: పంచాయతీల పరిధిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని స్థానిక



మాట్లాడుతున్న డీఎల్‌పీవో కుమార్

ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశమందిరంలో సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం రిసోర్స్‌పర్సన్లు ఎంపీహెచ్‌ఈవో స్వామి, పంచాయతీరాజ్ ఏఈఈ బాలకిశోర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్‌రామ్, సీడీపీవో జీవీ రమణ వైద్యం, తాగునీరు, బాల్యవివాహాలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో రామలక్ష్మి పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికలతో అభివృద్ధి: డీఎల్‌పీవో



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

అనంతగిరి: ముందస్తు ప్రణాళికలతో గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని డీఎల్‌పీవో కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని గురువారం సుస్థిర అభివృద్ధి లక్ష్యలతో పేరిట నిర్వహిస్తున్న శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఎంపీపీ శెట్టి నీలవేణితో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో కుమార్ మాట్లాడుతూ... పంచాయతీ అభివృద్ధిచెందాలంటే తప్పనిసరిగా ప్రణాళికలను రుపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, ఎంపీడీవో కుమార్, ఏఈ గౌతమ్, సీడీపీవో సంతోషికుమారి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'ప్రజాదర్బార్'

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



వినతులు పరిశీలిస్తున్న శ్రావణ్‌కుమార్

పాడేరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా దర్బార్ ద్వారా ప్రజలు, ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జీసీసీ చైర్మన్. మాజీ మంత్రి, టీడీపీ అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. స్థానికంగా ఉన్న తన క్యాంప్ కార్యాలయం లో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు అధిక సంఖ్యలో వినతులు వచ్చాయి. పెదబయలు మండలం గోమంగి పంచాయతీ కుమ్మరివీధి గ్రామంలో సీసీ రోడ్డు, గ్రామ సమీపంలోని తారురోడ్డు నిర్మించాలని పలువురు కోరారు. డుంబ్రిగుడ మండలం కించుమండల పంచాయతీ కుసుమవలస, చింతపల్లి మండలం కేఎస్.దుర్గం గ్రామాల్లో పాఠశాలలకు భవనాలు నిర్మించాలని వినతులు ఇచ్చారు. హుకుంపేట మండలం పెదబూరుగుపుట్టులో డ్రైనేజీ మంజూరు చేయాలని, సంతారి పంచాయతీ కుడబీరులో రామాలయం నిర్మించాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు శెట్టి లక్ష్మణుడు, పాండురంగస్వామి, బాకూరు వెంకటరమణ, సుబ్బారావు, శశిభూషన్, సత్యనారాయణ, సూర్యకాంతం, మహేశ్వరి, వెంకటరావు, అచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ ఉద్యోగుల హంస యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక



పాడేరు తాలూకా యూనిట్ కార్యవర్గం సభ్యులు

పాడేరురూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పాడేరు తాలూకా యూనిట్ మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల హంస యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించినట్లు ఏపీ హంస హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్ విశాఖపట్నం (ఉమ్మడి) జిల్లా అధ్యక్షుడు డి.చినబాబు తెలిపారు. గురువారం స్థానిక గిరిజన ఉద్యోగుల భవన్‌లో ఉద్యోగులతో సమావేశం నిర్వహించామన్నారు. సమస్యలపై చర్చించిన అనంతరం ఎన్నికలను నిర్వహించామన్నారు. జరిగినలో ఎన్నికల్లో పాడేరు తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా నడిగట్ల ప్రకాశరావు, కార్యదర్శిగా కె.సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా సకల నాగేశ్వరరావుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నికయ్యారన్నారు. ఎలక్షన్ ఆఫీసర్‌గా ఎన్.బాబ్జీ, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా ఎం.జాన్‌సన్ పాల్గొని ఎన్నికలను సజావుగా నిర్వహించారన్నారు. ఈ విశాఖ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎల్.సావిత్రి, చింతపల్లి తాలూకా యూనిట్ అధ్యక్షుడు కె.రామకృష్ణ, ఉపాధ్యక్షులు శ్యామసుందర్, కోటవరట్ల జనరల్ సెక్రటరీ కె.సరస్వతి, వి.మాడుగుల సెక్రటరీ టి.శేషగిరిరావు, పాడేరు యూనిట్ సహాయ కార్యదర్శి గులైలి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీనగర్-పాలగెడ్డ రహదారి నిర్మించాలి

గూడెంకొత్తవీధి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్‌వీనగర్-పాలగెడ్డ అంతర్ రాష్ట్ర ప్రధాన రహదారి నిర్మాణం జనవరిలో ప్రారంభించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ హెచ్చరించారు.. గురువారం మండలంలోని లంకపాకలు గ్రామం సమీపాన రహదారిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌వీనగర్-పాలగెడ్డ గ్రామం వరకు రహదారి అధ్వానంగా తయారైందన్నారు. దీంతో 30గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ఒడిశా, ఆంధ్ర, ఛతీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల ప్రయాణకులు అవస్థలు పడుతున్నారన్నారు. తాజాగా ప్రభుత్వం ఈరహదారి నిర్మాణానికి రూ.18 కోట్ల నిధులు ప్రభుత్వంనుంచి మంజూరైనా, ఆర్‌అండ్‌బీ నిర్మాణం ప్రారంభించడంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.



రహదారి దుస్థితి చూపుతున్న గిరిజన నాయకులు

రేషన్ సరకుల కోసం ఆందోళన

డుంబ్రిగుడ, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరకులు అందించాలని మండలంలోని గుంటగన్నెల పంచాయతీ డోమంగి గ్రామంలో లబ్ధిదారులు డిమాండ్ చేశారు. రేషన్ బియ్యం రెండు నెలలుగా సంబంధిత డీఏ డిపో నిర్వాహకులు పంపిణీ చేయలేదు. దీంతో వారు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు హరి, భగత్‌రాం, సీతారాం మాట్లాడుతూ, ప్రతి నెలా రేషన్ బియ్యం కోసం వెళ్తే డీఆర్ డీపోనిర్వాహకులు దురుసుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరకులు పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన చేశారు. దీనిపై జీసీసీ మేనేజర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.



డోమంగిలో ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

గ్యాస్ లీకేజీ బాధితులకు బంధవీధి గ్రామస్థులు ఆసరా

జి.మాడుగుల, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): కె.కోడాపల్లి గ్రామంలో ఇటీవల గ్యాస్ లీకేజీ అయి నష్టపోయిన బాధితులకు ఈ పంచాయతీ పరిధిలోని బంధవీధి గ్రామస్థులు సమష్టిగా ఆదుకున్నారు. కె. కోడాపల్లిలో చెందిన సోమెలి సింహాచలం, భాస్కరరావు ఇళ్లు ధ్వంసమైన విషయం తెలిసిందే. అయితే మానవత దృక్పథంతో బంధవీధిలోని పలు కుటుంబాలంతా కలిసి గురువారం రూ.15 వేలు, క్వింటా బియ్యంతో పాటు ఇతర నిత్యవసరాలు బాధితులకు అందజేశారు. పలువురు మహిళలు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసరాల పంపిణీ

చింతపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి మండలం భీమవరంలో ఆదివాసీలకు మనం సేవా సొసైటీ యువకులు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. గురువారం గ్రామాన్ని సందర్శించిన ఈ సభ్యులు ప్రతి కుటుంబానికి బియ్యం, పప్పు, కూరగాయలు అందించారు.

ఈసందర్భంగా సొసైటీ చైర్మన్ పెదిరెడ్ల గౌతమ్ సరేంద్ర మహర్షి మాట్లాడుతూ తమ సొంత నిధులతో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు జస్వంత్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

గూడెంకొత్తవీధి: మండలంలో ఈనెల 13నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. ప్రధానంగా ప్రజల నుంచి మ్యూటేషన్, కౌలు రైతుల కార్డులు(ఎల్‌ఈసీ), భూమి వివాదాలు, భూ ఆక్రమణలు, నిషేధ జాబితా22(ఏ) తదితర సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో డీటీ దుమంతి సత్యనారాయణ పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి...

అరకులోయ: మండలంలో జరిగే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని, తహసీల్దార్ వెంకటవరప్రసాద్ అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మ్యూటేషన్లు, భూముల్లో చేర్పులు,మార్పులు, సవరణ, ఎల్‌పీఎన్ తొలగింపు తదితర భూ సమస్యలపై వినతులు అందజేయాలని కోరారు.

గురుకుల ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి



గురుకుల ఉద్యోగులతో గిరిజన ఉద్యోగుల సంఘం, ఆదివాసీ జేఏసీ నాయకులు

పాడేరురూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల ఉపాధ్యాయ, అధ్యాపకుల డిమాండ్లు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, అసోసియేట్ అధ్యక్షులు మాసాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమను సీఆర్టీలుగా మార్చాలని డిమాండ్ చేస్తూ 27 రోజులుగా నిరాహార దీక్షలు చేపడుతున్న విషయం తెలిసిందే. గురువారం ఈ శిబిరాన్ని గిరిజన ఉద్యోగుల సంఘం, ఆదివాసీ జేఏసీ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన గురుకుల్లో 15 ఏళ్లగా విద్యా ప్రమాణాలు మెరుగుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపకులను సీఆర్టీలుగా మార్చాలని,మెగా డీఎస్సీలో రిక్రూట్మెంట్ నుంచి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న 1402 పోస్టులను మినహాయించాలని, ఏజెన్సీ ప్రాంతంలో స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగ సంఘం, ఆదివాసీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

» హౌసింగ్ పీడీ బాబునాయక్



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ బాబునాయక్, ఏఈ, తదితరులు

అనంతగిరి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని లబ్ధిదారులకు హౌసింగ్ పీడీ బి. బాబునాయక్ సూచించారు. మండలంలోని కొత్తూరు పంచాయతీ బెడ్డగుడ, కొండిబ పంచాయతీ పరిధిలోని తోకవలస, నిన్నిమామిడివలస గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ.. పీఎం జన్‌మన్ పథకం ద్వారా పీవీటీజీ కుటుంబాలకు కొత్తూరు పంచాయతీలోని 23, కొండిబలో 112 ఇళ్లులు మంజూరయ్యాయన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రప్రభుత్వం రూ. 2.39 లక్షలు కేటాయిస్తున్నట్టు తెలిపారు. దీనిపై గిరిజనులు మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణానికి ఈ డబ్బులు చాలటం లేదని, మరో రూ. లక్ష అదనంగా పెంచాలని పీడీని కోరారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని ఆయన లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. ఏఈ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చత్రాపల్లిలో బాధితులకు మోడల్ కాలనీ నిర్మించాలి

» ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నేత చిన్నయ్యపడాల్



చత్రాపల్లిలో గిరిజనులకు శారదా ట్రస్టు ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ

సీలేరు, డిసెంబరు 12 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం చత్రాపల్లిలోని వరద బాధితులకు ప్రభుత్వం, జిల్లా అధికారులు ప్రకటించిన మోడల్ కాలనీ హామీ అమలు చేయకపోవడం అన్యాయమని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. గురువారం గాలికొండ పంచాయతీ చత్రాపల్లి గ్రామాన్ని సందర్శించి సెప్టెంబరు 8 న జరిగిన వదరబాధితులను పరామర్శించారు. శారదా ట్రస్టు ఆధ్వర్యంలో అందించిన దుప్పట్లు, రగ్గులను 40 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ చత్రాపల్లి విపత్తుకు గురైన బాధితులకు జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మోడల్ కాలనీ ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. విపత్తు షెల్టరుకు ప్రభుత్వం రూ. 3 కోట్లు ప్రకటించినా, ఇంకా కార్యరూపం దాల్చలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు గడుతూరి సత్యనారాయణ, సోమలింగం, గాలికొండ ఎంపీటీసీ అంపురింగి బుజ్జిబాబు, మాజీ సర్పంచ్ గెమ్మెలి మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



మొండిజామిగుడ చర్చిలో చిన్నారులు వేస్తున్న నృత్యాలు

అనంతగిరి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొండిజామిగుడ గ్రామంలో చర్చిలో జాయ్ అండ్ పీస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ రమ్య పావని ఏసుక్రీస్తు జన్మదినం గొప్పతనాన్ని వివరించారు. అనంతరం జాయ్ అండ్ పీస్ మినిస్ట్రీస్ ఫౌండర్ కీర్తన పేదలకు చీరలు, రగ్గులను అందజేశారు. చిన్నారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పేదలకు ప్రేమివిందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ ఈకార్యక్రమంలోని పాస్టర్స్ పీటర్, దయానిధి, కుమార్, జోసెఫ్, ఎలీషారావు, సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీసీ కాంప్లెక్స్ పరిశుభ్రంగా ఉంచాలి

జి.మాడుగుల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్‌టీసీ బస్సు కాంప్లెక్స్‌లను పరిశుభ్రంగా ఉంచాలని పాడేరు ట్రాఫిక్ సూపర్ వైజర్ ఎస్‌టీపీ అప్పారావు ఆదేశించారు. స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్‌ని ఆయన గురువారం సందర్శించి పరిశీలించారు. బస్సులు రాకపోకలు కాంప్లెక్స్‌లో, ప్రయాణీకుల సౌకర్యాలపై అడిగితెలుసుకున్నారు. అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆర్‌టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సనాతన ధర్మం పరిరక్షణ అందరి బాధ్యత

గూడెంకొత్తవీధి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒకరిపై ఉన్నదని దానధర్మ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి డీవీడీ ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని పెదవలస పంచాయతీ బందవీధి గ్రామంలో ఆదివాసీలకు ఎన్‌ఆర్‌ఐ పట్టాభి రామారావు ఆర్థిక సహాయంతో దుప్పట్లు, ఆదివాసీ అర్చకులకు పూజా సామగ్రిని పంపించారు. ఈసందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ దేవతల ఆలయాల్లో అర్చకులు ధూప, దీప నైవేద్యాలకు పూజా సామగ్రి అందజేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కంకిపాటి గిరిబాబు, పెనుగొండ దుర్గ ప్రసాద్, కృష్ణంరాజు, శివయ్య పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

పార్టీలకతీతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

▸▸ కూటమి ముఖ్య నేతల సమావేశంలో ఎమ్మెల్యే కొణతాల

కొత్తూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకతీతంగా సాగు నీటి సంఘాల ఎన్నికలు జరగాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్పష్టం చేశారు. అనకాపల్లి పట్టణంలోని రింగురోడ్డులో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం కూటమి నాయకులతో సాగు నీటి సంఘాల ఎన్నికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తిచేసి ఉత్తరాంధ్రకు పుష్కలంగా సాగు, తాగు నీరు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో పంట కాలువలకు పూడికలు, గ్రోయిన్లకు మరమ్మతులు చేసి రైతులందరికీ అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్ని బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పడమటమ్మ విగ్రహ ప్రతిష్ఠ

టీడీపీ కార్యానిర్వాహక కార్యదర్శి రత్నాకర్ దంపతులకు సత్కారం


రత్నాకర్, అచ్యుత దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

కొత్తూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంపతిపురం పంచాయతీ తమ్మయ్యపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన పడమటమ్మ అమ్మవారి ఆలయంలోని పడమటమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ ఎంతో మహిమ గల పడమటమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరారు. అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో తమను భాగస్వామ్యం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు రత్నాకర్ దంపతులకు జ్ఞాపిక బహూకరించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు నంబారు రమణ, ఈసరపు రమణ, మంగా, ఎస్.అప్పారావు దానుడు, నాయుడు పాల్గొన్నారు.

టీడీపీలోకి రైతు సంఘం నేత పీలా బుజ్జి


పీలా బుజ్జి, కార్యకర్తలకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

తుమ్మపాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మపాలకు చెందిన రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పీలా బుజ్జి గురువారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పీలా బుజ్జికి కండువాను కప్పి నాయకులు పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పీలా బుజ్జి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రైతాంగానికి మేలు జరుగుతుందన్న నమ్మకంతో చేరానని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. అనంతరం పలువురు నాయకులు పీలా బుజ్జిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఆడారి గోవిందరావు, చదరం నాగేశ్వరరావు, కర్రి బాబి, రాపేటి రామ్‌కుమార్, సందిన సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించిన జడ్పీ డిప్యూటీ సీఈవో


కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఈవో

పరవాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో ఎస్.రాజ్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో చేపడుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. మరమ్మతులకు ఎంత మేరకు నిధులు వ్యయం చేస్తున్నారని ఎంపీడీవో ఎస్.డి.శ్యామ్‌సుందర్‌ను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో మండల పరిషత్ ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఏయే పనులకు ఎంత మేర ఖర్చు చేశారో ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆడిట్ రికార్డును పరిశీలించారు. సిబ్బంది జీతాల చెల్లింపుల గురించి ఆరా తీశారు. రికార్డులను సక్రమంగా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి ధర్మారావు, మండల పరిషత్ ఏవో రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ ఫిరోజాబేగం పాల్గొన్నారు.

దివ్యాంగులకు సత్కారం

కశింకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాలెం గ్రామంలో దివ్యాంగులను గురువారం పోలీసులు సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ ఎ.స్వామినాయుడు మాట్లాడుతూ దివ్యాంగులకు ఎటువంటి సమస్య ఉన్నా తెలిపితే పరిష్కరిస్తామన్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, ఎస్‌ఐ మనోజ్‌కుమార్, పలు పార్టీలు, సంఘాల నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.


దివ్యాంగులను సత్కరిస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

▸▸ అనకాపల్లి డీఈవో గిడ్డి అప్పారావునాయుడు

▸▸ పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

కశింకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని అనకాపల్లి జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లి ఎంపీపీ పాఠశాల, కన్నూరుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని దేవికుమారి సకాలంలో హాజరు కాకపోవడంపై గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఆకస్మికంగా వెళ్లి తనిఖీలు చేశారు. అనంతరం అక్కడి విద్యార్థులతో విద్యా బోధనపై ఆరా తీశారు. సమయానికి పాఠశాలలకు ఉపాధ్యాయులు రాకపోతే విద్యార్థులకు క్రమశిక్షణ ఎలా తెలుస్తుందని డీఈవో ప్రశ్నించారు. ఇకపై సమయపాలన లేకుండా పాఠశాలలకు వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాగే ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించారు. విద్యార్థులకు పాఠాల బోధనపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం కన్నూరుపాలెం జిల్లా పరిషత్ హైస్కూలును సందర్శించారు. అక్కడ పదో తరగతికి సంబంధించి కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి సత్యనారాయణ రూపొందించిన ప్రశ్నాపత్రాలు, పుస్తకాలను ఆవిష్కరించారు. 100 రోజుల బోధన కార్యక్రమంలో పదో తరగతి నాణ్యమైన, క్రమశిక్షణతో విద్యను అందించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. అనంతరం బయ్యవరం జడ్పీహెచ్ పాఠశాలను ఈ కార్యక్రమాల్లో ఎంఈవో-2 కేఎస్ఎస్.మూర్తి, ఇన్‌చార్జి హెచ్ఎం శేషరత్నం పాల్గొన్నారు.


కొత్తపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుల బోధనా తీరు పరిశీలిస్తున్న డీఈవో

ప్రతిష్ఠాత్మకంగా రెవెన్యూ సదస్సులు

▸▸ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర

తుమ్మపాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర పేర్కొన్నారు. మామిడిపాలెం గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలు అధికంగా ఉన్నాయని గుర్తించిన కూటమి ప్రభుత్వం, శాశ్వత పరిష్కారానికి కృషి చేసేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదన్నారు. అవినీతికి తావు లేకుండా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో భూ ఆక్రమాలు కోకొల్లలుగా ఉద్భవించాయన్నారు. ప్రధానంగా రైతులు తమ భూముల విషయంలో నానా అవస్థలు పడుతూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగే దుస్థితి దాపురించిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రతీ సమస్యను పరిష్కరించి న్యాయం చేకూర్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన చెప్పారు. సమస్యలు ఉన్న వారు రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్న వెంటనే పరిష్కరించేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. తహసీల్దార్ వై.విజయ్‌కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ పరంగా ఎదురవుతున్న ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. భూ సమస్యలు ఎదుర్కొంటున్న వారు నేరుగా రెవెన్యూ సదస్సుకు హాజరై అర్జీలు పెట్టుకోవచ్చునని చెప్పారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుకు హాజరైన వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేశ్, సర్పంచ్ పూడి పరదేశినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు బంధం అప్పలనాయుడు, నాయకులు కరణం శ్రీనివాసరావు, మాకవరపు సత్యనారాయణ పాల్గొన్నారు.


రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మళ్ల సురేంద్ర

ఎన్.జి.పాలెంలో టీడీపీ సభ్యత్వ నమోదుకు ప్రత్యేక శిబిరం

కశింకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతనగుంటపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ కార్యకర్తల పూర్తి వివరాలు నమోదు చేసుకొని సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 70 వేల మంది సభ్యత్వం తీసుకున్నారని వెల్లడించారు. నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి క్రమశిక్షణకు మారుపేరుగా ప్రతీ కార్యకర్త పని చేస్తున్నారన్నారు. వారి శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా అందించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. పార్టీలో ఒక కుటుంబ సభ్యుడిగా తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎటువంటి సమస్యనైనా తమ దృష్టికి తీసుకొస్తే సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని రత్నాకర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉగ్గిన భాస్కరరావు, వెంకటరమణ, వెంకట్, పిల్లి సుందర్రావు, శ్రీను, తార, గణేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి

▸▸ వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్నదాతకు అండగా శుక్రవారం ఉదయం చేపట్టే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. గురువారం రింగురోడ్డులోని పార్టీ కార్యాలయంలో వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన పోస్టర్‌ను బూడి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం పది గంటలకు రింగురోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి రైతులతో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి నిరసన తెలుపుతామని చెప్పారు. అక్కడ జిల్లా కలెక్టర్‌ను కలిసి రైతాంగ సమస్యలపై వినతిపత్రం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గొర్లి సూరిబాబు, దంతులూరి దిలీప్‌కుమార్, మందపాటి జానకిరామరాజు, మలసాల రమణరావు, కేఎం నాయుడు, బొడ్డేడ శివ, కోరుకొండ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ డీఈ ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు సబ్ స్టేషన్ కార్యాలయం పరిధిలోని 33/11 కేవీఏ ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా కొత్తూరు, మూలపేట, సత్యనారాయణపురం, సంపతిపురం, వేటజంగాలపాలెం, కూండ్రం, కుంచంగి, రొంగలివానిపాలెం, పిసినికాడ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. గృహ, వ్యవసాయ వినియోగదారులు ఈ అంతరాయాన్ని అర్థం చేసుకుని తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

పేదరిక నివారణకు అందరూ కృషి చేయాలి

▸▸ ఏపీఎస్ఐఆర్‌డీ డీడీ జె.రాజేంద్రనాథ్

సబ్బవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలోనే పేదరికాన్ని నివారించడానికి అందరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఏపీఎస్ఐఆర్‌డీ) డిప్యూటీ డైరెక్టర్ జె.రాజేంద్రనాద్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, మండల శాఖ అధికారులతో పేదరిక నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విధానాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కావాల్సిన మార్గదర్శకాలను ఆయన వివరించారు. ప్రకృతి వనరలను సంరక్షించుకుంటూ పేదరిక నిర్మూలనకు కృషి చేయాలన్నారు. నిరక్షరాస్యత, జనాభా పెరుగుదల, తక్కువ వ్యవసాయ ఉత్పాదకత, అనారోగ్య పరిస్థితులు పేదరికానికి కారణాలుగా ఆయన పేర్కొన్నారు. వాటిని అధిగమించడం వల్ల పేదరికాన్ని నిర్మూలించి అభివృద్ధి చెందిన దేశంగా గుర్తింపు పొందవచ్చన్నారు. సరైన గృహం, హుందాతనం కలిగిన జీవితం ఇవ్వడం వల్ల అభివృద్ధి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, ఏవో శివప్రసాద్‌నారాయణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ డి.శ్రీనివాస్, ఏపీఆర్ పి.హరిణి, సీడీపీవో వి.లలితకుమారి, ఏపీఎం సీహెచ్ శ్రీనివాసరావు, సర్పంచులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, సర్పంచులతో మాట్లాడుతున్న డీడీ

పశువైద్య శిబిరాలతో పాడి రైతులకు మేలు

పరవాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలతో పాడి రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని జడ్పీటీసీ మాజీ సభ్యుడు పైలా జగన్నాథరావు తెలిపారు. పశు సంవర్థక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకులమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం తానాం గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరం, పాడి రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ శిబిరంలో 65 పశువులకు, 22 లేగ దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. అలాగే రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు. పరవాడ పశువైద్య శాఖ ఏడీ కె.రామకృష్ణ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ కన్నూరు దేవి, వెటర్నరీ అసిస్టెంట్లు అశ్విని, సురేశ్, శివకుమార్, స్థానిక నాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి నలుగురికి గాయాలు

కశింకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తేగాడ మోడల్ స్కూలు సమీపంలో కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడిన సంఘటన గురువారం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో స్థానికులు అనకాపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో నలుగురు ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. మిగిలిన ఇద్దరిలో ఒక మహిళ కాగా, మరో వ్యక్తికి స్వల్పంగా గాయాలయ్యాయి. వీరిలో ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడం పెద్ద ప్రమాదం తప్పిందని వైద్యులు తెలిపారు.

పది మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద అమ్మకానికి తీసుకువెళ్తున్న పది మద్య సీసాలను గురువారం స్వాధీనం చేసుకొని ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ బోకం రామకృష్ణ తెలిపారు. రామాపురం కాలనీకి చెందిన డి.అప్పలనాయుడు అనకాపల్లిలో మద్యం కొనుగోలు చేసి కాలనీలోని ఇంటికి వెళ్తుండగా ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ వద్ద తనిఖీ చేయగా పది మద్యం సీసాలు లభ్యమయ్యాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు


ద్విచక్ర వాహనాలు, నిందితుడితో సీఐ, ఎస్ఐలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడిన ఓ యువకుడిని గురువారం అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. నిందితుడి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్‌లో పట్టణ పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేస్తుండగా కాకినాడ జిల్లా జగన్నాథపురం గ్రామానికి చెందిన యర్రంశెట్టి నాని మహేశ్(25) పట్టుబడ్డారన్నారు. ఇతన్ని విచారించగా ఈ నెల ఐదో తేదీన గాంధీనగరం అంజయ్యకాలనీలో ద్విచక్ర వాహనం, ఏడో తేదీన మిరియాలకాలనీ మోర్ షాపు వద్ద ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసినట్టు అంగీకరించాడన్నారు. ఆ వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

మామిడిపాలెంలో మెగా వైద్య శిబిరం


వైద్య శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతి

తుమ్మపాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపాలెం గ్రామంలో గురువారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతి మాట్లాడుతూ గ్రామస్థులు కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారని సర్పంచ్ పూడి పరదేశినాయుడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ శిబిరం నిర్వహించామన్నారు.ప్రముఖ వైద్యులు పావని, లతా, సంతోశ్ గ్రామస్థులకు అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అవసరమైన వారికి వ్యాధికి తగ్గ మందులను ఉచితంగా అందించామన్నారు. అలాగే గ్రామంలో అందరి నుంచి రక్త నమూనాలను సేకరించి వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా వైద్యాలయానికి పంపామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూడి పరదేశినాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు


రాయపుఅగ్రహారం సదస్సులో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దశాబ్దాలుగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని రాయపుఅగ్రహారం గ్రామంలో గురువారం జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఎటువంటి రెవెన్యూ సమస్యలు ఉన్నా సదస్సుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు, డీటీ గణపతిరావు, వీఆర్వోలు కామరాజు, రవి, ఈశ్వరరావు, ఎస్ఆర్‌వో జయలక్ష్మి, విలేజ్ సర్వేయర్ శ్రీను, రైతులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ


ఉపకార వేతనాలు అందిస్తున్న దృశ్యం

పరవాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భరణికం గ్రామంలో గురువారం పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. హరిప్రియ చారిటబుల్ ట్రస్టు ద్వారా జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, మాజీ ఎంపీపీ జగన్నాథరావు ఈ మొత్తాన్ని అందించారు. అలాగే వంద మంది పేదలకు రగ్గులు అందజేశారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గంగాధరరావును సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెదిశెట్టి రామారావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, సర్పంచులు ఎస్.అప్పలనాయుడు, ఎం.సన్యాసినాయుడు, మాజీ సర్పంచ్ బి.తాతారావు, కూటమి నాయకులు రెడ్డి శ్రీను, పి.సత్యారావు, దాట్ల గణేశ్ రాజు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యలకు పరిష్కారం: తహసీల్దార్

పరవాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్న ప్రతీ సమస్యను క్షుణ్ణంగా విచారించి నిర్ణీత గడువు లోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎస్.వి.అంబేడ్కర్ తెలిపారు. మండలంలోని వాడచీపురుపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతీ రెవెన్యూ సమస్యను సదస్సు ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. అర్జీలు చేసుకున్న ప్రతీ ఒక్కరి సమస్యను 45 రోజుల్లోగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. వాడచీపురుపల్లి తూర్పు రెవెన్యూ పరిధిలో తొమ్మిది అర్జీలు వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివలంక లక్ష్మి, ఉప సర్పంచ్ కూండ్రపు శ్రీను, మండల సర్వేయర్ కర్రి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి బి.అచ్యుతరావు, వీఆర్వో రొంగలి హేమలత, రైతులు పాల్గొన్నారు.

అచ్చెర్లలో లేగదూడల ప్రదర్శన

కశింకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చెర్ల గ్రామంలో గురువారం లేగదూడల ప్రదర్శన కార్యక్రమం జరిగింది. జిల్లా పశుసంవర్థక శాఖాధికారి రామమోహన్, ఏడీ డాక్టర్ సౌజన్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ ఎస్ఎస్ఎస్ వీర్యం వాడడం వల్ల ఆడదూడలు పుడతాయన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని చెప్పారు. ఈ ప్రదర్శనలో 75 లేగ దూడలు పాల్గొనగా మొదటి మూడు బహుమతులను ఎంపిక చేసి రైతులకు అందజేశారు. మొదటి బహుమతి సందిన అప్పారావు, రెండవ బహుమతి దొడ్డి రాము నాయుడు, మూడో బహుమతి నిమ్మదల నాగేశ్వరరావులకు దక్కాయి. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు దయాన, అల్లాన్స్ గ్రామ నాయకులు నైనంశెట్టి రమణారావు, దొడ్డి నాగేశ్వరరావు, నిమ్మదల సన్యాసినాయుడు, జానీ, భీమవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కశింకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతనగుంటపాలెం గ్రామ శివారున పేకాట ఆడుతున్న శిబిరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడుల్లో ఐదుగురు జూదరులను అరెస్టు చేశామని సీఐ స్వామినాయుడు తెలిపారు. వీరి నుంచి రూ.15,100లు నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

ఆరోగ్యానికి భరోసానిచ్చే ఆహారపదార్థాలు

సేంద్రియం... దివ్యౌషధం

- ఏయూలో ఆర్గానిక్ మేళా
- 300 స్టాల్స్‌లో సేంద్రియ ఉత్పత్తుల విక్రయం
- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న నగరవాసులు





సేంద్రియ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న మహిళా రైతులు

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): **ఆరోగ్యమే మహాభాగ్యం అని అందరికీ తెలిసిందే. అయితే మారుతున్న ఆహార అలవాట్లు, అధిక దిగుబడి పేరుతో రసాయన ఎరువుల వినియోగం విపరీతంగా పెరిగిపోవడంతో విషతుల్య పదార్థాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో వాటినే కొనుగోలు చేసి, ఆహారంలో భాగం చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది. అయితే ఇటీవల సేంద్రియ ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతుండడం, మార్కెట్‌లో అందుబాటులోకి రావడంతో వాటిని వినియోగించే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సేంద్రియ ఉత్పత్తులను ప్రజలకు మరింత చేరువ చేసే ఉద్దేశంతో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఆర్గానిక్ మేళాను ప్రారంభించారు. ఇక్కడ సుమారు 300 స్టాల్స్‌లో వివిధ రకాల వ్యవసాయోత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు చేపడుతున్నారు.**

రసాయనాలతో పండించిన ఆహార పదార్థాలను తీసుకోవడంతో చిన్న వయసులోనే అనేక అనారోగ్య సమస్యలతో జనం సతమతమవుతున్నారు. నాలుగైదు తరాలకు ముందు పంటల్లో రసాయనిక ఎరువుల వినియోగం లేదు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం మాత్రమే సాగేది. క్రమేపీ రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోయింది. దీంతో నేల నిస్సారమై పంటలు సైతం కలుషితమయ్యాయి. పురుగుమందుల వినియోగంతో వాటి అవశేషాలు కూరగాయలు, ఇతర ఆహారపదార్థాలపై ఉండిపోయి రోగాలకు హేతువులవుతున్నాయి. దీంతో సేంద్రియ ఉత్పత్తులకు ఆదరణ పెరిగింది. ఈ దశలో ఆర్గానిక్ మేళాకు నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

అందుబాటులో 300 స్టాల్స్

రాష్ట్రంలోని పలు ప్రాంతాల రైతులు ఆర్గానిక్ మేళాలో 300 స్టాల్స్‌లో తమ ఉత్పత్తులు ప్రదర్శించారు. తృణధాన్యాలు, చిరుతినుబండారాలు, ఆకుకూరలు, చేనేత వస్త్రాలు, వంటింటిలో వినియోగించే మట్టి, కర్ర, రాతితో చేసిన వస్తువులు, ప్రసిద్ధి నొందిన మాడుగుల హల్వ, అందమైన పూలమొక్కలు, ఆర్గానిక్ విత్తనాలు, గోధుమ గడ్డి, పిచ్చుకలకు మేత వేసే వరికంకులు, డ్రైఫ్రూట్స్, పప్పుధాన్యాలు, ఏజెన్సీలో లభ్యమయ్యే దుంప జాతులు, ఆహార ధాన్యాలు, మసాల దినుసులు, నూనెలు వంటి ఉత్పత్తులెన్నో నగరవాసులకు అందుబాటులో ఉంచారు. అన్ని ఉత్పత్తులు సేంద్రియ పద్ధతిలో సాగు చేసినవే కావడంతో కొనుగోలుకు జనం ఎగబడుతున్నారు.







20 రకాల బియ్యం...

దుకాణాలు, స్టోర్స్‌లో విక్రయించే మూడు, నాలుగు రకాల బియ్యమే చాలా మందికి తెలుసు. కానీ ఆర్గానిక్ మేళాలో 20 రకాల బియ్యం అందుబాటులో ఉన్నాయి. కేన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులను దరిచేరనివ్వని కర్పు కవని, వీర్య కణాలు వృద్ధి చేసే మాపిళ్లై సాంబ, శరీర నొప్పులు రాకుండా పనిచేసే రాజముడి, గర్భిణులకు సంపూర్ణ పోషకాలనిచ్చే కుళాకర్, బహురూపి, మధుమేహం, బీపీ వ్యాధులను నియంత్రించే అరిక, సామ, అండు కొర్ర, కొర్ర బియ్యం ప్రదర్శనలో ఉంచడమే కాకుండా వాటి ఉపయోగాలు కూడా రైతులు వివరిస్తున్నారు. ఆరోగ్యం కోసం వినియోగించే బియ్యం ధరలు కాస్త కేజీ రూ.80 నుంచి రూ.200 వరకు ఉన్నాయి. రోగాలను దరి చేరనివ్వని తృణధాన్యాలు, పప్పు దినుసులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అలాగే మిద్దె పంటలతో ఆర్గానిక్ వ్యవసాయం చేయాలనుకునే వారికి అన్ని రకాల విత్తనాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. మేళాలో మ్యాంగోఐస్‌కు విపరీతమైన ఆదరణ లభిస్తోంది. మామిడి పండు గుజ్జును ఐస్‌గా రూపొందించి, మధ్యలో వెదురుపుల్లతో అందించే ఈ ఐస్‌ను సందర్శకులు ఆరగించి, ఆనందపడుతున్నారు.

ఏయూలో ప్రారంభమైన ఆర్గానిక్ మేళా



సేంద్రియ ఎరువులతో పండించిన వరి కంకులను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

విశాపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో గురువారం గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం నిర్వహించిన ఆర్గానిక్ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎరువులు, పురుగు మందుల వినియోగంతో పండించిన పంటలు తినడంవల్ల ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తున్నాయన్నారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయోత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ పురుగు మందులు, రసాయన ఉత్పత్తుల కారణంగానే వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. సేంద్రియ ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ప్రజారోగ్యం మెరుగుపడుతుందన్నారు. గో ఆధారిత ప్రకృతివ్యవసాయదారుల సంఘం అధ్యక్షుడు వర్మ మాట్లాడుతూ 300 స్టాల్స్‌తో 15వ తేదీ వరకు మేళా నిర్వహిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఆర్గానిక్ మేళాను నగర వాసులు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలగం కుమార్‌స్వామి, జేవీ రత్నం, తదితరులు పాల్గొన్నారు.



ఆర్గానిక్ కాయగూర మొక్కలు

నర్సీపట్నంలో ఇఫ్కో కార్యాలయం

- ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇఫ్కో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, అమలుచేస్తున్న పథకాలు పారదర్శంగా ఉండాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం పెదబొడ్డేపల్లిలో సమగ్ర రైతు సహకార సంస్థ(ఇఫ్కో) కార్యాలయాన్ని స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళాభివృద్ధికి సంస్థ కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఇఫ్కో మైక్రో లెండర్ స్కీమ్‌లో మహిళలకు నిత్యావసర సరకులు అందజేశారు. అనంతరం సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చింతకాయల పద్మావతి, రాజునాయుడు, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి సూర్యచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడ

... 5వ పేజీ తరువాయి

చేసుకుంటున్నాడు. బిజినెస్ లైసెన్స్ ఫీజులు బకాయిలు, రెన్యువల్స్ ఇంటి పన్ను బకాయిలు వెంటనే చెల్లించాలని చెబుతున్నాడు. ట్రూ కాలర్‌లో కూడా 'మునిసిపల్ కమిషనర్' అని డిస్‌ప్లే అవుతున్నది. దీంతో నిజంగానే మునిసిపల్ కమిషనర్ ఫోన్ చేశారని పలువురు భావించారు. మాజీ కౌన్సిలర్ రావాడ నాయుడుకి, రామారావుపేటకు చెందిన డాక్టర్ సువర్ణకు ఇదే నంబర్ నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయి. డాక్టర్ సువర్ణ ఈ విషయాన్ని మునిసిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణకి చెప్పడంతో ఆయన కమిషనర్‌కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. రావాడ నాయుడు కూడా కమిషనర్‌కు ఫోన్ చేసి విషయాన్ని తెలిపారు. పన్నుల కోసం తాను ఎవరికీ ఫోన్ చేయలేదని కమిషనర్ సురేంద్ర చెప్పారు. వెంటనే ఆయన అప్రమత్తమై ఇటువంటి ఫోన్ కాల్స్‌కి స్పందించ వద్దని మునిసిపాలిటీలో ప్రతి ఒక్కరికీ మెసేజ్‌లు పంపారు. ఆస్తి పన్ను, బిజినెస్ పన్ను బకాయిల వసూళ్ల బాధ్యతను ఏ ఒక్క డిజిటల్ ప్లాట్‌ఫామ్‌కు ఇవ్వలేదని, పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి పెదబొడ్డేపల్లిలోని మునిసిపల్ కార్యాలయానికి నేరుగా వచ్చి పన్నులు చెల్లించాలని కోరారు. ఇటువంటి ఫోన్ కాల్స్ వస్తే తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. తన పేరుతో ఫోన్ చేసిన వారిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశామని కమిషనర్ తెలిపారు.

తోటకూరపాలెం హైస్కూల్ స్థలం కబ్జా

- జిల్లా కలెక్టర్‌కు స్థానిక యువకులు ఫిర్యాదు
- స్పందించిన కలెక్టర్.. చర్యలు తీసుకోవాలని ఆదేశాలు
- డీఈవో, జిల్లా సర్వేయర్ ఆధ్వర్యంలో సర్వే
- 3.53 ఎకరాలు ఆక్రమణకు గురైనట్టు నిర్ధారణ



ఆక్రమణకు గురైన తోటకూరపాలెం ఉన్నత పాఠశాల స్థలాన్ని సర్వే చేస్తున్న జిల్లా అధికారులు

రావికమతం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటకూరపాలెంలో ఆక్రమణకు గురైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలానికి గురువారం జిల్లా అధికారులు సర్వే నిర్వహించారు. మొత్తం ఐదు ఎకరాలకుగాను మూడున్నర ఎకరాలు కబ్జాకు గురైనట్టు నిర్ధారించారు. ఆక్రమణలను సత్వరమే తొలగించి పాఠశాలకు చెందిన స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తామని డీఈవో అప్పారావునాయుడు తెలిపారు.

మండలంలోని తోటకూరపాలెం గ్రామానికి సుమారు ఇరవై ఏళ్ల క్రితం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మంజూరైంది. గ్రామస్థుల అభ్యర్థన మేరకు పాఠశాల ఏర్పాటు కోసం సర్వే నంబరు 246/1లో వున్న 7.9 ఎకరాల కొండ వాగు భూమిలో ఐదు ఎకరాలు కేటాయించారు. భవనాలు నిర్మించగా కొంత స్థలం ఖాళీగా వుంది. చుట్టూ ప్రహరీ గోడ నిర్మించకపోవడంతో పక్కనే వున్న కొంతమంది రైతులు పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకోవడం ప్రారంభించారు. దీంతో పాఠశాల స్థలం కుంచించుకుపోయింది. ఈ నేపథ్యంలో హైస్కూల్ స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల రూ.37 లక్షలు మంజూరు చేసింది. అయితే పాఠశాల స్థలం కబ్జాకు గురైందని, ఆక్రమణలను తొలగించిన తరువాత ప్రహరీ గోడ నిర్మించాలని ఇటీవల గ్రామానికి చెందిన కొంతమంది యువకులు జిల్లా కలెక్టర్‌కు స్వయంగా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. సర్వే నిర్వహించి సరిహద్దులు గుర్తించాలని అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లా విద్యా శాఖ అధికారి అప్పారావు నాయుడు ఆధ్వర్యంలో జిల్లా సర్వే అధికారి (డీఎస్ఎల్‌ఓ) ఎస్.గోపాలరాజు సమక్షంలో అధికారులు ఎఫ్ఎంబీ ప్రకారం సర్వే చేసి హద్దులు నిర్ధారించారు. ఉన్నత పాఠశాలకు చెందిన 3.53 ఎకరాలు ఆక్రమణకు గురైందని గుర్తించారు. ఆక్రమణలను త్వరితగతిన తొలగించి పాఠశాల స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తామని డీఈవో చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేశ్, వీఆర్వో అప్పారావు, ప్రధానోపాధ్యాయుడు వర్మ పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవానికి కృషి చేయండి

- టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ



సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

సబ్బవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి, ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ కోరారు. ఇరువాడలోని జీఎస్ కన్వెన్షన్‌లో గురువారం నియోజక వర్గ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం వల్ల కేంద్ర ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి నిధులు విడుదల చేస్తుందన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో సాగునీటి చెరువుల అభివృద్ధి జరగ లేదన్నారు. అందుకే ఈ నెల 14న కూటమి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మీ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు గండి దేముడు, దాసరి రమణ, రేసుపూడి రమణ, రెడ్డి నారాయణరావు, గవర అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన జిల్లా కలెక్టర్ల రెండో రోజు సదస్సుకు హాజరైన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా

ఏటికొప్పాకలో ఢిల్లీ బృందం

- బొమ్మల తయారీ, కళాకారుల స్థితిగతులు పరిశీలన



ఏటికొప్పాకలో బొమ్మల తయారీని పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం సభ్యులు

ఎలమంచిలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఏటికొప్పాకగ్రామాన్ని గురువారం ఢిల్లీ నుంచి వచ్చిన ఇద్దరు మహిళా ప్రతినిధుల బృందం స్థానిక అధికారులతో కలిసి సందర్శించింది. హస్తకళాకారులను కలిసి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. బొమ్మల తయారీని పరిశీలించి, కళాకారులు తయారు చేసిన బొమ్మలను తిలకించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఎస్.చిన్నయాచారి.. అంకుడు కర్రతో బొమ్మల తయారీ, సహజసిద్ధ రంగుల వినియోగం, బొమ్మల విశిష్టత, హస్తకళాకారుల స్థితిగతుల గురించి వారికి వివరించారు. ప్రధానమంత్రి ఇచ్చిన 'ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి' పిలుపు మేరకు ఏటికొప్పాక కళాఖండాలను పరిశీలించడానికి ఈ బృందం వచ్చినట్టు జిల్లా అధికారులు తెలిపారు. అన్ని అంశాలపై నివేదికను తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని వారు చెప్పారు. వీరి వెంట డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి, చేనేత, హస్తకళల శాఖ ఏడీ ఆర్‌వీ మురళీకృష్ణ, హెచ్‌డీసీ జిల్లా మేనేజర్ కార్తీక్, తదితరులు వున్నారు.

ప్రకృతి సేద్యానికి జీవం

... 5వ పేజీ తరువాయి

వ్యవసాయానికి ఊతమిచ్చేందుకు దేశవ్యాప్తంగా కోటి మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా రూ.2,481 కోట్ల విలువైన జాతీయ మిషన్ (ఎన్ఎంఎన్ఎఫ్)కు ప్రధాని మోదీ నేతృత్వంలోని మంత్రి మండలి గత నెల చివరి వారంలో ఆమోదం తెలిపింది. భూసారాన్ని మెరుగుపరిచి, రసాయనాలు లేని ఆహారాన్ని అందించడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించాలన్నది ఈ మిషన్ ఉద్దేశం. వచ్చే రెండేళ్లలో దేశవ్యాప్తంగా 7.5 లక్షల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తారు. జీవామృతం, బీజామృతం వంటి ఉత్పత్తులను అందుబాటులో ఉంచేందుకు బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్ల (బీఆర్సీల)ను ఏర్పాటు చేస్తారు. వీటికి జీవామృతం, బీజామృతం వంటివి అందించడానికి 18.75 లక్షల మంది ఔత్సాహిక రైతులకు శిక్షణ ఇస్తారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి నమూనా సాగు క్షేత్రాలను కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, రైతుల పొలాల్లో ఏర్పాటు చేస్తారు. ప్రకృతి వ్యవసాయంలో అనుభవజ్ఞులైన రైతులు, శిక్షకుల ద్వారా ఆసక్తి ఉన్న రైతులకు శిక్షణ ఇప్పిస్తారు.

ప్రకృతి వ్యవసాయం.. బహుళ ప్రయోజనం

పైలా సూరిబాబు, ప్రకృతి వ్యవసాయ విభాగం చోడవరం ఇన్‌చార్జి



ప్రకృతి వ్యవసాయం వల్ల బహుళ ప్రయోజనాలు వున్నాయి. భూసారం మెరుగుపడుతుంది. రసాయన ఎరువులు వాడకపోవడం వల్ల పంట సాగు ఖర్చు తగ్గుతుంది. అదే విధంగా ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయి. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్‌లో ఆదరణ పెరుగుతుండడంతో పలువురు రైతులు ప్రకృతి సేద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం కూడా ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నది. భవిష్యత్తులో ఎక్కువ శాతం రైతులు ప్రకృతి సేద్యం విధానంలో పంటలు పండించేలా చైతన్య పరుస్తున్నాం.

తూరల రోడ్డుతో వెతలు

... 5వ పేజీ తరువాయి

చేపలను దించి పూడిమడక కొత్త బస్టాండ్ వద్ద గల మార్కెట్‌కి తీసుకువచ్చి విక్రయిస్తుంటారు.

ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు 2018లో పూడిమడకకు ఫిషింగ్ హార్బర్‌ను మంజూరు చేసింది. సర్వే నిర్వహించి భూమిని ఎంపిక చేయడంతోపాటు రూ.300 కోట్లు కేటాయించింది. హార్బర్ నిర్మించడంతోపాటు సముద్రంలో చేపల వేట అనంతరం పడవలు పూడిమడక గ్రామానికి దగ్గరగా రావడానికి వీలుగా ఉప్పుటేరుని లోతుచేయడంతోపాటు ఇరుపైపులా రక్షణ గోడలు నిర్మించాలని నిర్ణయించింది. హార్బర్‌కు వెళ్లే ఉప్పుటేరు మీద వంతెన నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు. హార్బర్ పనులు ప్రారంభించే సమయానికి సాధారణ ఎన్నికలు వచ్చి టీడీపీ ఓడిపోవడంతో పనులు అటకెక్కాయి. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో హార్బర్ గురించి పట్టించుకోలేదు. ఈ ఏడాది సాధారణ ఎన్నికల ముందు హడావిడిగా పనులు ప్రారంభించారు. పూడిమడక-లోవపాలెం రోడ్డు నుంచి ఉప్పుటేరు మీదుగా ముందుగా రోడ్డు వేశారు. అయితే ఎత్తు వంతెన కాకుండా తూరలు వేసి రోడ్డు వేసేశారు. మత్స్యకారులు అప్పట్లోనే దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. తమ పడవలు గ్రామానికి దగ్గరగా రావడానికి వీలుకాదని, ఉప్పుటేరులో పడవల రాకపోకలకు అనువుగా వంతెన నిర్మించాలని ఆందోళన చేశారు. కానీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో చేసేదేమీలేక మత్స్యకారులు తమ పడవలను ఉప్పుటేరులో తూరల వంతెన వద్ద నిలిపివేసి, రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా

... 5వ పేజీ తరువాయి

స్థలం ఎక్కడ వుందో తెలియని పరిస్థితి నెలకొంది. హెచ్‌టీ విద్యుత్ టవర్ల వద్ద కూడా భారీగా గ్రావెల్ తవ్వేస్తుండడంతో టవర్లకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొంది. పైడివాడ, పైడివాడ అగ్రహారం లే-అవుట్లను ఆనుకొని ఉన్న కొండను, గొల్లలపాలెం రెవెన్యూ పరిధిలో ఒక ప్రైవేటు లే-అవుట్‌ను కూడా అక్రమార్కులు విడిచిపెట్టలేదు. గతంలో మాదిరిగానే రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజామున ఐదు గంటల వరకు ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్ తవ్వి, లారీల్లోకి లోడింగ్ చేసి వెదుళ్లనరవ, కొత్తూరు, దువ్వాడ ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. ఇక్కడి నుంచి పగటిపూట గాజువాక, అగనంపూడి ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. అయినప్పటికీ రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. గంగవరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో పలువురికి ఎక్స్‌కవేటర్లు, డంపర్ లారీలు వున్నాయి. గ్రావెల్ తవ్వకాల ద్వారా అక్రమంగా సంపాదించిన సొమ్ముతోనే వీటిని కొనుగోలు చేశారని స్థానికులు చెబుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	93.00
లైవ్ ధర	113.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619